PRGI REGD No.: TGTEL/26/A4986

# ప్రభాత కిరణమ్

సత్యానికి వారధి

అమరావతి | సంపుటి : 01 | సంచిక : 014 | బుధవారం | 08-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/-    www.prabhathakiranam.com

Amaravathi | Volume : 01 | Issue : 014 | Wednesday | 08-07-2026 | Pages: 08 | Price : Rs.4/-    Circulated to Telangana | Published from Medchal Malkajgiri




6లో..

# 2029ని శాసించేది కాపు ఓటేనా?

- ఏపీ రాజకీయాల్లో క్యాస్ట్ ఫ్యాక్టర్
- ఎవరికి గెలుపు, ఎవరికి ఓటమి?

రాష్ట్ర రాజకీయాల్లో కాపు సామాజిక వర్గం పేరు వినిపించిన ప్రతిసారి ఎన్నికల సమీకరణాలు ఒక్కసారిగా మారిపోతాయి. అధికారాన్ని అందుకోవాలన్నా, నిలబెట్టుకోవాలన్నా కాపు ఓటు కీలకమనే అంచనా దశాబ్దాలుగా కొనసాగుతోంది. వంగవీటి రంగా ఆత్మగౌరవ ఉద్యమం నుంచి ముద్రగడ పద్మనాభం రిజర్వేషన్ పోరాటం వరకు, ప్రజారాజ్యం ప్రయోగం నుంచి జనసేన అధికార భాగస్వామ్యం వరకు కాపు రాజకీయాల ప్రయాణం ఎన్నో మలుపులు చూసింది. ఇప్పుడు 2029 ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరోసారి కాపు ఓటు రాజకీయ చర్చల కేంద్రంగా మారింది. కాపులు కేవలం ఎన్నికల సమయంలో గుర్తుకొచ్చే ఓటు బ్యాంకేనా? లేక ప్రభుత్వాలను నిర్ణయించే రాజకీయ శక్తిగా ఎదిగారా? ప్రాంతాల వారీగా మారుతున్న ఓటింగ్ ధోరణి, కొత్త తరం ఆలోచనలు, నాయకత్వ పరిణామాలు, ప్రధాన పార్టీల వ్యూహాలు, సామాజిక సమీకరణాలు కలిసి ఏపీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారి తీస్తున్నాయి. కాపు రాజకీయాల గతం, వర్తమానం, 2029పై వాటి ప్రభావాన్ని విశ్లేషించే ప్రత్యేక కథనం ఇది.

- పదేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయం
- జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి రుణమాఫీ
- ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు
- ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించకుంటే ఇకపై భూసేకరణ
- సీఎం అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయాలు

# అమరావతి రైతులకు గుడ్‌న్యూస్

## భూములు ఇచ్చిన రైతులకు ₹ 40వేల కౌలు

అమరావతి రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి భరోసా కల్పించింది. రెండో దశ ల్యాండ్ పూలింగ్‌లో పాల్గొన్న రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.40 వేల యాన్యుటీని పదేళ్లపాటు అందించాలని సీఆర్డీఏ నిర్ణయించడం కీలకంగా మారింది. జనవరి 6లోపు తీసుకున్న వ్యవసాయ రుణాలకు రుణమాఫీ వర్తింపజేయడంతో పాటు ఇనాం భూములకు రూ.159 కోట్ల పరిహారం మంజూరు చేసింది. మరోవైపు ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించని రైతులపై భూ సేకరణ ప్రక్రియ ప్రారంభిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. రైతుల సంక్షేమం, రాజధాని అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ 63వ సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయాలు వెలువడ్డాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 63వ సీఆర్డీఏ సమావేశంలో అమరావతి రాజధాని అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రెండో దశ ల్యాండ్ పూలింగ్, రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండో దశ ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు 2024 జూన్ నుంచి ఎకరానికి ఏడాదికి రూ.40 వేల చొప్పున యాన్యుటీ చెల్లించాలని సీఆర్డీఏ నిర్ణయించింది. ఈ సాయం భూములు ఇచ్చిన తేదీ నుంచి పదేళ్లపాటు అమలులో ఉంటుంది. ప్రతి ఏడాది జరీబు భూములకు ఎకరానికి రూ.5 వేల చొప్పున, మెట్ట భూములకు రూ.3 వేల చొప్పున యాన్యుటీ పెంచేందుకు కూడా ఆమోదం తెలిపింది. గ్రామకంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. (వివరాలు 2లో..)



## రూ.9,076 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

### ఎస్ఐపీబీ సమావేశంలో కీలక నిర్ణయాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో జరిగిన 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు, ఎస్ఐపీబీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, మౌలిక సదుపాయాల రంగాలకు సంబంధించిన రూ.9,076 కోట్ల విలువైన 11 ప్రాజెక్టులపై సమగ్రంగా చర్చించి ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపునిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. (వివరాలు 2లో..)

# లోకల్ నుంచి గ్లోబల్



2లో..

- హస్తకళలకు ప్రపంచ మార్కెట్
- కళాకారులకు అండగా పవన్ కల్యాణ్
- హస్తకళా మహోత్సవంలో డిప్యూటీ సీఎం

విజయవాడ అంబేడ్కర్ కళా వేదికలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సందర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వారి కళాఖండాలను ఆసక్తిగా వీక్షించి, పలువురితో నేరుగా మాట్లాడారు. కళాకారుల ప్రతిభను అభినందిస్తూ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



## సీఐ నాగరాజు విచారణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో నిందితుడు, సస్పెండెడ్ సీఐ నాగరాజును విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారించేందుకు ఏపీ హైకోర్టు సిట్‌కు అనుమతి ఇచ్చింది. ఈ నెల 9 నుంచి ఎనిమిది రోజుల పాటు కస్టడీలో విచారణ జరపాలని ఆదేశించింది. విచారణ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేసి సంబంధిత కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. దిగువ కోర్టు విధించిన షరతులను సవరిస్తూ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారణ జరిపినా నిందితుడి హక్కులకు ఎలాంటి భంగం కలగదని హైకోర్టు అభిప్రాయపడింది. కేసు దర్యాప్తు వేగవంతం చేసేందుకు ఈ నిర్ణయం కీలకంగా మారింది.

# దక్షిణ కొరియాలో లోకేశ్ దౌత్యం



## పెట్టుబడులపై కీలక చర్చలు

ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో విస్తృత పర్యటన కొనసాగిస్తున్నారు. పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో అధునాతన పరిశ్రమలు, సాంకేతిక రంగ సంస్థలు ఏర్పాటు చేసే అవకాశాలపై చర్చిస్తున్నారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీకండక్టర్లు, ఆటోమొబైల్ రంగాల్లో పెట్టుబడులను తీసుకురావడంపై దృష్టి సారించారు. (వివరాలు 2లో..)

# పులివెందులకు జగన్ రాక

## ప్రజా దర్బార్‌లో సమస్యలపై వినతి

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కడప జిల్లా పులివెందులకు చేరుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో భాకరాపురం హెలిప్యాడ్‌కు వచ్చారు. అక్కడ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. (2లో..)





7లో..

## అసలు చేతికి వచ్చేది ఎంత?

# వైరల్‌గా మారిన రూ.35 లక్షల జీతం

- గ్రాస్ జీతంపై చర్చ.. ఫామ్-16తో రచ్చ

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మేనేజర్‌కు సంబంధించిన ఫామ్ 16 సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జీతాలపై పెద్ద చర్చ మొదలైంది. ఆ పత్రంలో వార్షిక గ్రాస్ జీతం రూ.35.24 లక్షలుగా కనిపించడంతో చాలామంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్ల క్రితం ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరిన ఉద్యోగి ప్రస్తుతం స్కేల్ 3 మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు పోస్టులో పేర్కొన్నారు. అయితే ఫామ్ 16లో కనిపించే మొత్తం నిజంగా ప్రతి నెల ఉద్యోగి చేతికి వచ్చే జీతం కాదని వివరించడంతో చర్చ మరో మలుపు తిరిగింది.

## రామ మందిర విరాళాల వివాదం

- నైతిక బాధ్యతతో తప్పుకున్నా
- చంపత్ రాయ్ రాజీనామా
- ఆమోదించిన ట్రస్ట్

అయోధ్య రామ మందిర విరాళాల చోరీ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన వేళ రామ మందిర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. నైతిక బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ట్రస్ట్ సమావేశంలో ఆయన రాజీనామాపై చర్చించి సోమవారం అధికారికంగా ఆమోదించింది. (వివరాలు 7లో..)





## మెలోనీ అంటే ఇష్టమే..

- కానీ... ఆమె కోపరేట్ చేయడం లేదు
- మనసులో మాట బయటపెట్టిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో తన సంబంధాలపై చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. మెలోనీ తనకు వ్యక్తిగతంగా నచ్చుతారని, మంచి వ్యక్తి అని పేర్కొన్న ట్రంప్, ఇరాన్ అంశంలో ఆమె సహకరించకపోవడం వల్ల ఇద్దరి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని చెప్పారు. టర్కీ అధ్యక్షుడు తయ్యిప్ ఎర్దోగాన్‌తో సమావేశం సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. (7లో..)

## తాజ్‌మహల్ వివాదానికి కొత్త మలుపు

### తేజో మహాలయ వాదనపై విచారణ

### కేంద్రానికి హైకోర్టు నోటీసులు

### హైకోర్టు జోక్యంతో కేసుకు ఊపు

ఆగ్రాలోని ప్రపంచ ప్రఖ్యాత తాజ్‌మహల్‌కు సంబంధించిన వివాదంలో అలహాబాద్ హైకోర్టు కీలక జోక్యం చేసుకుంది. తాజ్‌మహల్‌లో తేజో మహాలయ ఆలయం ఉందని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం, భారత పురావస్తు సర్వే శాఖ, ఏఎస్ఐ, ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. (2లో..)





## భారత్ దౌత్య విజయం

### రక్షణ నుంచి విద్య వరకు కీలక ఒప్పందాలు

### భారత్-ఇండోనేషియా బంధం బలోపేతం

### ఇండోనేషియా అత్యున్నత పురస్కారం

భారత్ దౌత్యానికి మరో కీలక మైలురాయి దక్కింది. ఇండోనేషియా పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్ణా' ప్రదానం కావడం రెండు దేశాల స్నేహానికి కొత్త బలం ఇచ్చింది. రక్షణ, సాంకేతికత, ఆరోగ్యం, విద్య, డిజిటల్ చెల్లింపులు, సముద్ర భద్రత వంటి అనేక కీలక రంగాల్లో దాదాపు డజను ఒప్పందాలు కుదిరాయి. (7లో..)

## మరపురాని జ్ఞాపకం..

### జనం మనసుల్లో చెరగని సంతకం

- ప్రజల గుండెల్లో చిరస్థాయిగా... వైఎస్సార్
- 77వ జన్మదినం సందర్భంగా...



2లో..

జూలై 8... ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఇది కేవలం ఒక మాజీ ముఖ్యమంత్రి జన్మదినం మాత్రమే కాదు. లక్షలాది మంది సాధారణ ప్రజలకు ఇది తమ జీవితాన్ని మార్చిన ఒక నాయకుడిని గుర్తు చేసుకునే రోజు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, రాజకీయంగా విభేదించినా... డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు వినగానే ఇప్పటికీ ఎంతోమంది కళ్లల్లో ఒక ప్రత్యేకమైన భావోద్వేగం కనిపిస్తుంది. ఎందుకంటే ఆయనను వారు కేవలం ముఖ్యమంత్రిగా కాదు... తమ ఇంటి మనిషిగా గుర్తుంచుకున్నారు.



# అమరావతి రైతులకు గుడ్‌న్యూస్

- భూములు ఇచ్చిన రైతులకు ₹ 40వేల కౌలు
- పదేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయం
- జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి రుణమాఫీ
- ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు
- ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించని వారిపై భూసేకరణ కత్తి
- సీఎం అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయాలు

అమరావతి రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి భరోసా కల్పించింది. రెండో దశ ల్యాండ్ పూలింగ్‌లో పాల్గొన్న రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.40 వేల యాన్యుటీని పదేళ్లపాటు అందించాలని సీఆర్డీఏ నిర్ణయించడం కీలకంగా మారింది. జనవరి 6లోపు తీసుకున్న వ్యవసాయ రుణాలకు రుణమాఫీ వర్తింపజేయడంతో పాటు ఇనాం భూములకు రూ.159 కోట్ల పరిహారం మంజూరు చేసింది. మరోవైపు ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించని రైతులపై భూసేకరణ ప్రక్రియ ప్రారంభిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. రైతుల సంక్షేమం, రాజధాని అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ 63వ సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయాలు వెలువడ్డాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 63వ సీఆర్డీఏ సమావేశంలో అమరావతి రాజధాని అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రెండో దశ ల్యాండ్ పూలింగ్, రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండో దశ ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు 2024 జూన్ నుంచి ఎకరానికి ఏడాదికి రూ.40 వేల చొప్పున యాన్యుటీ చెల్లించాలని సీఆర్డీఏ నిర్ణయించింది. ఈ సాయం భూములు ఇచ్చిన తేదీ నుంచి పదేళ్లపాటు అమలులో ఉంటుంది. ప్రతి ఏడాది జరీబు భూములకు ఎకరానికి రూ.5 వేల చొప్పున, మెట్ట భూములకు రూ.3 వేల చొప్పున యాన్యుటీ పెంచేందుకు కూడా ఆమోదం తెలిపింది. గ్రామకంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది.

## రైతులకు రుణమాఫీ అమలు

కొత్తగా ల్యాండ్ పూలింగ్‌లో పాల్గొనే రైతు కుటుంబాలకు వ్యవసాయ రుణమాఫీ అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ ఏడాది జనవరి 6లోపు తీసుకున్న వ్యవసాయ రుణాలకు మాఫీ వర్తిస్తుందని మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యమవుతున్న రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రైతుల సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అమరావతి ప్రాంతంలోని ఇనాం భూముల విషయంలో కూడా సీఆర్డీఏ కీలక నిర్ణయం తీసుకుంది. దేవాదాయ శాఖకు చెందిన ఇనాం భూముల కోసం రూ.159 కోట్ల పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. భూసేకరణ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

## భూములు ఇవ్వకుంటే భూసేకరణ

ల్యాండ్ పూలింగ్‌కు ఇంకా అంగీకరించని రైతులు గడువులోగా భూములివ్వాలని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఆలోపు స్వచ్ఛందంగా భూములు ఇవ్వని పక్షంలో బుధవారం నుంచి భూసేకరణ ప్రక్రియ ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే జారీ చేసిన ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్‌ను 2.5 ఎకరాల భూములకూ అమలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం చట్టపరమైన విధానంలోనే ముందుకు సాగుతుందని చెప్పారు. రాజధాని అమరావతిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అమరావతిలోని 25 టౌన్‌షిప్‌లలో కనీసం ఒక్కో అంతర్జాతీయ పాఠశాల ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మౌలిక వసతులు, విద్య, పెట్టుబడులు, రైతుల సంక్షేమం సమన్వయంతో అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతున్నట్లు సమావేశంలో వెల్లడించారు.

# రూ.9,076 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

- ఎస్ఐపీబీ సమావేశంలో కీలక నిర్ణయాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో జరిగిన 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు, ఎస్ఐపీబీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, మౌలిక సదుపాయాల రంగాలకు సంబంధించిన రూ.9,076 కోట్ల విలువైన 11 ప్రాజెక్టులపై సమగ్రంగా చర్చించి ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపునిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

### పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం

భారీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత వేగవంతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుతో యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పెట్టుబడులు పెరగడం వల్ల ప్రాంతీయ అభివృద్ధికి కూడా బలమైన పునాది ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. పారదర్శక పాలన, మెరుగైన మౌలిక సదుపాయాలు, పరిశ్రమలకు అనుకూల వాతావరణంతో మరిన్ని పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

# లోకల్ నుంచి గ్లోబల్

- హస్తకళలకు ప్రపంచ మార్కెట్
- హస్తకళా మహోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్




విజయవాడ అంబేద్కర్ కళా వేదికలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సందర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వారి కళాఖండాలను ఆసక్తిగా వీక్షించి, పలువురితో నేరుగా మాట్లాడారు. కళాకారుల ప్రతిభను అభినందిస్తూ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## ఏపీ హస్తకళలకు ప్రపంచ గుర్తింపు

ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలకు పుట్టినిల్లని పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర కళాకారుల నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మార్కెట్ అవకాశాలు మరింత పెరిగితే హస్తకళా రంగం కొత్త శిఖరాలకు చేరుకుంటుందని చెప్పారు. "వోకల్ ఫర్ లోకల్" మాత్రమే కాదు, "లోకల్ టు గ్లోబల్" లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. మారుమూల గ్రామాల్లో తయారయ్యే కళాఖండాలు కూడా అంతర్జాతీయ మార్కెట్కు చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒక జాతి గొప్పతనం కట్టడాల్లో కనిపించదని, కళాకారుల సృజనలో కనిపిస్తుందని పవన్ వ్యాఖ్యానించారు. హస్తకళాకారులు కేవలం వస్తువులు తయారు చేయడం కాదని, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని సజీవంగా కొనసాగిస్తున్నారని కొనియాడారు. దేశ సంస్కృతి, వారసత్వం నిలవాలంటే హస్తకళలు, చేనేత రంగాలను కాపాడాల్సిన బాధ్యత అందరిదని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా కళాకారులు తమ ప్రతిభతో జీవనోపాధి పొందుతున్నారని గుర్తుచేశారు.



# మరపురాని జ్ఞాపకం.. జనం మనసుల్లో.. చెరగని సంతకం



ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్ నేడు 77వ జన్మదినం

**జులై 8... ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఇది కేవలం ఒక మాజీ ముఖ్యమంత్రి జన్మదినం మాత్రమే కాదు. లక్షలాది మంది సాధారణ ప్రజలకు ఇది తమ జీవితాన్ని మార్చిన ఒక నాయకుడిని గుర్తు చేసుకునే రోజు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, రాజకీయంగా విభేదించినా... డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు వినగానే ఇప్పటికీ ఎంతోమంది కళ్లల్లో ఒక ప్రత్యేకమైన భావోద్వేగం కనిపిస్తుంది. ఎందుకంటే ఆయనను వారు కేవలం ముఖ్యమంత్రిగా కాదు... తమ ఇంటి మనిషిగా గుర్తుంచుకున్నారు. రాజకీయ నాయకుల జీవితాలను సాధారణంగా ఎన్నికల విజయాలు, ఓటములు, అధికార కాలంతో కొలుస్తారు. కానీ కొంతమంది నాయకుల విషయంలో ప్రజలు అలా చేయరు. వారు తమ జీవితాల్లో జరిగిన ఒక మార్పును, ఒక సాయాన్ని, ఒక కష్టకాలంలో అందిన భరోసాను గుర్తు చేసుకుంటారు. వైఎస్సార్ విషయంలో కూడా అదే జరిగింది. ఆయన గురించి మాట్లాడేటప్పుడు చాలామంది ముందుగా చెప్పేది రాజకీయాలు కాదు... తమ జీవిత కథనే.**

### ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్సార్

ఒక రైతు ఇప్పటికీ "ఆ కాలంలో ఉచిత విద్యుత్ లేకపోయి ఉంటే మా బావి ఎండిపోయేది" అని చెబుతాడు. ఒక పేద కుటుంబం "ఆరోగ్యశ్రీ లేకపోతే మా ఇంట్లో ఆ మనిషి బతికేవాడు కాదు" అని గుర్తు చేసుకుంటుంది. మరో విద్యార్థి "ఫీజు రీయింబర్స్‌మెంట్ వల్లే నేను చదివాను" అంటాడు. ఈ జ్ఞాపకాలు గణాంకాల్లో కనిపించవు. కానీ ఇవే ఒక నాయకుడిని ప్రజల గుండెల్లో నిలబెడతాయి. వైఎస్సార్ ప్రజల్లోకి వెళ్లిన తీరు కూడా ఆయనను ప్రత్యేక నాయకుడిగా నిలిపింది. ఎండలు మండుతున్నా, వర్షాలు కురుస్తున్నా... గ్రామాల్లో నడుస్తూ ప్రజల బాధలు విన్న పాదయాత్ర ఇప్పటికీ రాజకీయాల్లో ఒక మైలురాయిగా చెప్పబడుతుంది. ఆ యాత్రలో ఆయన వినింది కేవలం సమస్యలు కాదు... ప్రజల మనసు. అదే తర్వాత ఆయన పాలనలో అనేక నిర్ణయాలకు పునాది అయిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతుంటారు.

### కాలం మారినా తగ్గని వైఎస్సార్ ఆదరణ

ఆయనను కలిసిన చాలామంది ఒక విషయాన్ని చెబుతుంటారు. పెద్ద హోదాలో ఉన్న వ్యక్తితో మాట్లాడుతున్న భావన కంటే, తమ ఇంట్లోని పెద్ద మనిషితో మాట్లాడుతున్న అనుభూతి కలిగేదని. గ్రామీణ భాషలో, సూటిగా, చిరునవ్వుతో మాట్లాడే ఆయన తీరు ప్రజలకు దగ్గర చేసింది. నాయకుడికి ఉండే దూరం కంటే, మనిషికి ఉండే దగ్గరితనం ఎక్కువగా కనిపించేది. ఒక నాయకుడి వారసత్వం అనేది కేవలం నిర్మించిన భవనాలు, ప్రారంభించిన ప్రాజెక్టులు మాత్రమే కాదు. ఆయన వెళ్లిపోయిన తర్వాత కూడా ప్రజలు ఎలా గుర్తు చేసుకుంటున్నారు అనేదే అసలైన కొలమానం. వైఎస్సార్ మరణించి ఎన్నో సంవత్సరాలు గడిచినా, ప్రతి జూలై 8న గ్రామాల్లో ఆయన ఫొటోకు పూలమాల వేయడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం... ఇవన్నీ ఒక వ్యక్తిపై ప్రజలకు ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తాయి.

### రాజకీయాలకు అతీతం... వైఎస్సార్ జ్ఞాపకం

అయితే ప్రతి నాయకుడిలాగే వైఎస్సార్ పాలనపై కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆయన ప్రభుత్వ విధానాలను ప్రశంసించినవారూ ఉన్నారు, విమర్శించినవారూ ఉన్నారు. అభివృద్ధి, ఆర్థిక నిర్వహణ, సంక్షేమం వంటి అంశాలపై రాజకీయ చర్చలు అప్పుడూ జరిగాయి, ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో అలాంటి చర్చలు సహజం. కానీ ఆ చర్చలకు అతీతంగా, ఆయనతో ప్రజలు ఏర్పరచుకున్న భావోద్వేగ బంధం మాత్రం ప్రత్యేకంగా నిలిచింది. ఆయన ఆకస్మిక మరణం కూడా ప్రజల మనసులను తీవ్రంగా కదిలించింది. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి విధుల్లో ఉండగానే జరిగిన హెలికాప్టర్ ప్రమాదం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆ వార్త తెలిసిన రోజు రాష్ట్రవ్యాప్తంగా కనిపించిన విషాదం, దిగ్భ్రాంతి... ఇప్పటికీ చాలామందికి మరచిపోలేని జ్ఞాపకం. ఆ రోజు రాజకీయాలు మాట్లాడినవారు చాలా తక్కువ. ఒక నాయకుడిని కోల్పోయామనే బాధను వ్యక్తం చేసినవారు ఎక్కువ.

### నాయకత్వానికి కొత్త నిర్వచనం ఇచ్చిన వైఎస్సార్

వైఎస్సార్ జయంతి వచ్చిందంటే కేవలం ఆయనను స్మరించుకోవడమే కాదు... ఒక ప్రశ్న కూడా ముందుకు వస్తుంది. ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించే నాయకత్వం అంటే ఏమిటి? పదవి వల్ల వచ్చే గౌరవమా? లేక ప్రజల జీవితాల్లో కనిపించే మార్పా? ఈ ప్రశ్నకు ప్రతి ఒక్కరి సమాధానం వేరుగా ఉండొచ్చు. కానీ ప్రజల జ్ఞాపకాల్లో ఒక నాయకుడు ఎంతకాలం జీవిస్తాడో నిర్ణయించేది ఆయనతో ఏర్పడిన మానవ సంబంధమే. కాలం మారుతుంది. రాజకీయాలు మారతాయి. కొత్త నాయకులు వస్తారు. కొత్త హామీలు వినిపిస్తాయి. కానీ కొన్ని పేర్లు మాత్రం కాలానికి అతీతంగా నిలిచిపోతాయి. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అలాంటి అరుదైన నాయకుల్లో ఒకరని ఆయన అభిమానులు భావిస్తారు. అదే సమయంలో ఆయన వారసత్వంపై భిన్నమైన రాజకీయ అంచనాలు కూడా కొనసాగుతూనే ఉంటాయి. ఈ రెండు వాస్తవాలు కలిసి ఆయన వ్యక్తిత్వాన్ని మరింత చర్చనీయాంశంగా నిలబెడుతున్నాయి.

### కాలం మారినా చెరిగిపోని వైఎస్సార్ ముద్ర

అందుకే ప్రతి ఏడాది ఆయన జయంతి వచ్చినప్పుడు, కొన్ని కుటుంబాల్లో అది కేవలం ఒక నాయకుడి పుట్టినరోజు కాదు... తమ జీవితంలో ఒక మలుపు తిరిగిన రోజులను గుర్తు చేసుకునే సందర్భం. ఒక రైతు పొలంలో, ఒక విద్యార్థి సర్టిఫికెట్ లో, ఒక రోగి చిరునవ్వులో, ఒక వృద్ధుడి ఆశీర్వాదంలో... ఎక్కడో ఒకచోట వైఎస్సార్ జ్ఞాపకం ఇంకా సజీవంగానే ఉంటుంది. ఒక నాయకుడు చరిత్రలో నిలవొచ్చు... కానీ ఒక మనిషి ప్రజల హృదయాల్లో నిలవాలంటే, వారి జీవితాల్లో చెరగని ముద్ర వేయాలి. వైఎస్సార్ గురించి ఈ రోజు కూడా జరిగే చర్చలు, జ్ఞాపకాలు, భావోద్వేగాలు... ఆ ముద్ర ఎంత లోతుగా పడిందో గుర్తు చేస్తున్నాయి.

# పులివెందులకు జగన్ రాక

- ప్రజా దర్బార్లో సమస్యలపై వినతి



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కడప జిల్లా పులివెందులకు చేరుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బెంగళూరు నుంచి హెలికాప్టర్లో భాకరాపురం హెలిప్యాడ్కు వచ్చారు. అక్కడ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్లో వినతుల స్వీకరణ

సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో వైఎస్ జగన్ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. స్థానిక సమస్యలు, వ్యక్తిగత ఇబ్బందులు, ప్రజా సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను విన్నారు. పార్టీ కార్యకర్తలతో కూడా సమావేశమై స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలపై చర్చించినట్లు సమాచారం. ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

## ఇడుపులపాయలో నివాళులు

ప్రజా దర్బార్ అనంతరం జగన్ పులివెందులలోని తన నివాసంలో బస చేశారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఇవాళ ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ను సందర్శించి నివాళులర్పించనున్నారు. అనంతరం నిర్వహించే జయంతి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది.

## జయంతి కార్యక్రమాలకు ఏర్పాట్లు

వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని పులివెందుల, ఇడుపులపాయ ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలు, నివాళి సభలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. వైఎస్సార్ ఆశయాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలను చేపట్టారు. జగన్ పర్యటనతో పులివెందులలో రాజకీయ సందడి నెలకొంది. జయంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలపై పార్టీ వర్గాల్లో ఆసక్తి కనిపిస్తోంది.

# తాజ్‌మహల్ వివాదానికి కొత్త మలుపు

- తేజో మహాలయ వాదనపై విచారణ
- కేంద్రానికి హైకోర్టు నోటీసులు
- హైకోర్టు జోక్యంతో కేసుకు ఊపు



ఆగ్రాలోని ప్రపంచ ప్రఖ్యాత తాజ్‌మహల్‌కు సంబంధించిన వివాదంలో అలహాబాద్ హైకోర్టు కీలక జోక్యం చేసుకుంది. తాజ్‌మహల్‌లో తేజో మహాలయ ఆలయం ఉందని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం, భారత పురావస్తు సర్వే శాఖ, ఏఎస్ఐ, ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు రాజ్యాంగంలోని ఆర్టికల్ 227 పరిధిలో పరిశీలించాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తి జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. దీంతో ఈ వివాదం మరోసారి జాతీయ స్థాయిలో చర్చకు దారితీసింది.

## శాస్త్రీయ సర్వే కోరుతున్న పిటిషనర్లు

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది హరిశంకర్ జైన్, న్యాయవాది సౌమ్య శ్రీవాస్తవ వాదనలు వినిపించారు. తాజ్‌మహల్ ప్రాంగణంలో సమగ్ర శాస్త్రీయ పరిశీలన, భౌతిక సర్వే నిర్వహిస్తేనే అక్కడ హిందూ మత చిహ్నాలు లేదా పురాతన నిర్మాణ అవశేషాలు ఉన్నాయా అనే విషయంపై స్పష్టత వస్తుందని తెలిపారు. పూర్తి స్థాయి పరిశోధన లేకుండా చారిత్రక వాస్తవాలను నిర్ధారించడం సాధ్యం కాదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం, భారత పురావస్తు సర్వే శాఖ ప్రతివాదులుగా ఉన్నాయి. వారి తరఫున అదనపు సొలిసిటర్ జనరల్, న్యాయవాది మనోజ్ కుమార్ సింగ్ హాజరయ్యారు. తదుపరి విచారణకు ముందు తమ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. నోటీసుల అమలుకు అవసరమైన చర్యలను పది రోజుల్లో పూర్తి చేయాలని కూడా స్పష్టం చేసింది.

## 2015లో న్యాయపోరాటం

ఈ వివాదం కొత్తది కాదు. 2015లో ఆగ్రా స్థానిక కోర్టులో పిటిషనర్లు మొదట సివిల్ దావా దాఖలు చేశారు. తాజ్‌మహల్‌లో స్థానిక పరిశీలన నిర్వహించేందుకు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించాలని కోరారు. అక్కడ హిందూ మతానికి సంబంధించిన శిల్పాలు, నిర్మాణ ఆనవాళ్లు ఉన్నాయా అనే విషయాన్ని నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే 2019లో ఆగ్రా సివిల్ జడ్జి ఆ దరఖాస్తును సాంకేతిక కారణాలతో తిరస్కరించారు. సివిల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్లు జిల్లా కోర్టును ఆశ్రయించారు. అయితే 2026 ఏప్రిల్ 4న అదనపు జిల్లా న్యాయమూర్తి కూడా ఆ రివిజన్ పిటిషన్‌ను కొట్టివేశారు. చట్టపరంగా అది విచారణకు అనర్హమని పేర్కొన్నారు.

# దక్షిణ కొరియాలో లోకేశ్ దౌత్యం

- పెట్టుబడులపై కీలక చర్చలు

ఆంధ్రప్రదేశ్ కు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో విస్తృత పర్యటన కొనసాగిస్తున్నారు. పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో అధునాతన పరిశ్రమలు, సాంకేతిక రంగ సంస్థలు ఏర్పాటు చేసే అవకాశాలపై చర్చిస్తున్నారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీకండక్టర్లు, ఆటోమొబైల్ రంగాల్లో పెట్టుబడులను తీసుకురావడంపై దృష్టి సారించారు.

## హ్యుందాయ్ మోబిస్తో కీలక భేటీ

హ్యుందాయ్ మోబిస్ ఉన్నతస్థాయి ప్రతినిధులతో మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ను ఎలక్ట్రిక్ వాహనాల సెమీకండక్టర్స్ హబ్గా అభివృద్ధి చేయాలని కంపెనీని కోరారు. విశాఖపట్నంలో హ్యుందాయ్ మోబిస్ పరిశోధన, ఇంజినీరింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తిరుపతి, అనంతపురం ప్రాంతాల్లో ఈవీ కాంపోనెంట్లు, బ్యాటరీ సిస్టమ్స్ తయారీ యూనిట్లు స్థాపించాలని ఆహ్వానించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కొత్త దిశ చూపుతాయని వివరించారు.

## పరిశోధనకు భాగస్వామ్యం ప్రతిపాదన

అటానమస్ డ్రైవింగ్, అడ్వాన్స్డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ (ఏడీఏఎస్), స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యం కావాలని లోకేశ్ కోరారు. ఐఐటీ తిరుపతితో కలిసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని వివరించారు. అనంతపురాన్ని ఆటోమొబైల్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు హ్యుందాయ్ మోబిస్ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## ఏపీలో ఆటోమొబైల్ హబ్ లక్ష్యం

టైర్ 1 ఆటోమొబైల్ సరఫరాదారుల అంతర్జాతీయ సమావేశాన్ని ఆంధ్రప్రదేశ్లో నిర్వహించాలని లోకేశ్ ప్రతిపాదించారు. హ్యుందాయ్ మోబిస్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అనంతపురం యూనిట్లో హ్యుందాయ్, కియా కంపెనీలకు అవసరమైన కీలక మాడ్యూల్స్ తయారీకి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు హ్యుందాయ్ మోబిస్ ప్రతినిధులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను ఉన్నతస్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.



## అపాక్ట్ సీఈవోతో భేటీ

అపాక్ట్ సంస్థ సీఈవో సియాంగ్ డాంగ్ లీతో కూడా మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఓఎస్ఏటీ సెమీకండక్టర్ రంగంలో నైపుణ్యాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడులు పెట్టేందుకు అపాక్ట్తో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని ప్రతిపాదించారు. ఇతర ఓఎస్ఏటీ సంస్థలను కూడా రాష్ట్రానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. హనా మైక్రాన్ వంటి ప్రముఖ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా సహకరించాలని సూచించారు.

## విశాఖ సెమీకండక్టర్ ప్రాజెక్టుకు ఊపు

విశాఖపట్నంలో చేపడుతున్న సెమీకండక్టర్ ప్రాజెక్టు రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మక విజయమని లోకేశ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని అపాక్ట్ సీఈవో వెల్లడించారు. విశాఖలో త్వరలో యూనిట్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. రూ.468 కోట్ల పెట్టుబడితో ఈ సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు కానుంది. ఏడాదికి 9.6 కోట్ల పరికరాల తయారీ సామర్థ్యంతో ఈ కేంద్రం పనిచేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా అధునాతన సాంకేతిక పరిశ్రమలకు ఊతం లభించడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు అందనున్నాయని ప్రభుత్వం భావిస్తోంది.




# టీఆర్ఎస్ పేరు వివాదం

## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత

కల్వకుంట్ల కవిత ప్రతిపాదించిన కొత్త రాజకీయ పార్టీ పేరుపై కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. "తెలంగాణ రక్షణ సమితి" పేరును తన పార్టీకి కేటాయించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. మే 12, జూన్ 23 తేదీల్లో ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసులను ఆమె సవాలు చేశారు. పార్టీ పేరును ఖరారు చేసే విషయంలో ఎన్నికల సంఘం అనుసరించిన విధానంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

### ఎన్నికల సంఘం అభ్యంతరాలు

ఈసీ తరపు న్యాయవాది కోర్టుకు కీలక వివరాలు వెల్లడించారు. ఇప్పటికే ఒకే తరహా పేర్లతో రెండు రాజకీయ పార్టీలు నమోదు అయ్యాయని, అలాంటి పరిస్థితుల్లో మరోసారి అదే భావాన్ని సూచించే పేరును అనుమతించడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. కవిత ప్రతిపాదించిన పార్టీ పేరుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చినట్లు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇలాంటి అంశాల్లో వ్యక్తిగత విచారణ ఇవ్వడం సాధారణంగా ఉండదని కూడా పేర్కొన్నారు.

### వ్యక్తిగత విచారణకు అవకాశం

కవిత తరపు న్యాయవాదులు మాత్రం ఎన్నికల సంఘం తమ వాదనలు వినకుండా నిర్ణయం తీసుకోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు కవితకు మధ్యంతర ఊరట కల్పించింది. తుది నిర్ణయం తీసుకునే ముందు ఆమెకు వ్యక్తిగతంగా వాదనలు వినిపించే అవకాశం కల్పించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. వారం రోజుల్లోగా విచారణ నిర్వహించి, ఆ తర్వాత కారణాలతో కూడిన తుది ఉత్తర్వులు జారీ చేయాలని స్పష్టం చేసింది.

### కోర్టు కీలక వ్యాఖ్యలు

విచారణ సందర్భంగా హైకోర్టు కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సంఘానికి ముందుగా పూర్తి వివరణ ఇవ్వకుండా నేరుగా కోర్టును ఆశ్రయించడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడింది. ఈ అంశంపై నేరుగా జోక్యం చేసుకుంటే అది ఎన్నికల సంఘం విధుల్లో జోక్యం చేసుకున్నట్లవుతుందని పేర్కొంది. ముందుగా ఎన్నికల సంఘం ఎదుట తమ వాదనలు వినిపించాలని, అనంతరం అవసరమైతే కోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది.

### తుది నిర్ణయంపై ఆసక్తి

ఈ వ్యవహారంతో ప్రతిపాదిత పార్టీ పేరుపై చర్చ మరింత వేడెక్కింది. ఎన్నికల సంఘం ముందు జరిగే వ్యక్తిగత విచారణలో కవిత తన వాదనలను వివరించే అవకాశం లభించనుంది. ఆ వాదనలను పరిశీలించిన తర్వాతే ఎన్నికల సంఘం తుది నిర్ణయం ప్రకటించాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం కేవలం పార్టీ పేరు అంశానికే పరిమితం కాకుండా, భవిష్యత్తులో రాజకీయ పార్టీల పేర్ల నమోదు ప్రక్రియకు కూడా మార్గదర్శకంగా మారే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ప్రియుడి కోసం భర్త హత్య

- ఏడు నెలలకు గుట్టురట్టు
- మిస్సింగ్ కేసుగా మొదలైన దర్యాప్తు
- తప్పించుకోవాలనుకున్న భార్య అరెస్ట్




హైదరాబాద్‌లోని మియాపూర్‌లో సంచలనం రేపిన హత్య కేసును పోలీసులు ఏడు నెలల తర్వాత ఛేదించారు. భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్యే అసలు హంతకురాలని దర్యాప్తులో తేలింది. గతేడాది నవంబర్‌లో తన భర్త వెంటేష్ (45) కనిపించడం లేదంటూ మహిళ మియాపూర్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తొలుత సాధారణ అదృశ్య కేసుగా భావించినా, విచారణలో అనుమానాలు తలెత్తడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు.

### సీసీటీవీ, కాల్ రికార్డులతో వెలుగులోకి

దర్యాప్తులో భాగంగా పోలీసులు మహిళ కాల్ డీటెయిల్ రికార్డులు, వివిధ ప్రాంతాల సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఆమె తరచూ మరో వ్యక్తితో మాట్లాడుతున్నట్లు గుర్తించారు. ఆ తర్వాత విచారణను విస్తరించగా వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానాలు బలపడ్డాయి. చివరకు తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. విచారణలో మహిళ కూడా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు.

### మహారాష్ట్ర సరిహద్దులో మృతదేహం

పోలీసుల వివరాల ప్రకారం, భర్తను హత్య చేసిన తర్వాత మృతదేహాన్ని వాహనంలో మహారాష్ట్ర సరిహద్దు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి పూడ్చిపెట్టారు. ఆధారాలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ఈ పని చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మహిళ ఇచ్చిన సమాచారంతో మియాపూర్ పోలీసులు మహారాష్ట్ర పోలీసుల సహకారంతో అక్కడ తవ్వకాలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. మరణానికి ఖచ్చితమైన కారణాలను ఫోరెన్సిక్ నివేదిక ద్వారా నిర్ధారించనున్నారు.

### ప్రియుడి కోసం హత్య చేసినట్లు అంగీకారం

తన ప్రేమ వ్యవహారానికి భర్త అడ్డుగా మారాడనే కారణంతో ఈ హత్యకు పాల్పడినట్లు మహిళ విచారణలో అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. హత్యకు ముందు పక్కా ప్రణాళిక రూపొందించి, ఆ తర్వాత మిస్సింగ్ ఫిర్యాదు ఇచ్చి పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినట్లు వెల్లడించారు. అయితే సాంకేతిక ఆధారాలు, దర్యాప్తు పద్ధతుల కారణంగా మొత్తం కుట్ర బయటపడింది.

### భార్య అరెస్ట్.. ప్రియుడి కోసం గాలింపు

ఈ కేసులో మహిళను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. హత్యలో కీలక పాత్ర పోషించిన ఆమె ప్రియుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపారు. అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. ఈ ఘటన మియాపూర్ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. మిస్సింగ్ కేసుగా నమోదైన ఫిర్యాదు చివరకు పథకం ప్రకారం జరిగిన హత్యగా మారడం స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. పూర్తి ఆధారాలను సేకరించిన తర్వాత నిందితులపై ఛార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు.



# న్యాయవాదుల డిమాండ్లకు ఎమ్మెల్యే మద్దతు

అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ చేపట్టిన ఒకరోజు నిరాహార దీక్షకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సంఘీభావం తెలిపారు. న్యాయవాదుల పరిరక్షణ బిల్లును వెంటనే అమలు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల స్టైఫండ్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# సింగరేణికి భారీ ఊరట

- తాడిచర్ల-2 గనులకు కేంద్రం ఆమోదం
- ₹ 64 వేల కోట్ల ఆదాయానికి చాన్స్
- వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



తెలంగాణలోని సింగరేణి సంస్థకు తాడిచర్ల2 బొగ్గు గనులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారని, సంబంధిత ఫైల్‌పై తాను సంతకం చేసినట్లు చెప్పారు. గతంలో పలువురు ముఖ్యమంత్రులు ఈ గనులను సింగరేణికి కేటాయించాలని కోరినా సాధ్యం కాలేదని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని అమలు చేసిందని పేర్కొన్నారు.

### 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు

తాడిచర్ల2 బొగ్గు గనిలో సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ గని నుంచి ఏటా సుమారు ఆరు మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉందన్నారు. దాదాపు 40 నుంచి 50 సంవత్సరాల పాటు ఈ గనిలో బొగ్గు ఉత్పత్తి కొనసాగుతుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సింగరేణికి రూ.64 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని చెప్పారు. వేలం ప్రక్రియ లేకుండా నేరుగా గని కేటాయించడం వల్ల ఆక్షన్ ప్రీమియం రూపంలో చెల్లించాల్సిన కనీసం రూ.2,550 కోట్లు సంస్థకు ఆదా అవుతాయని వివరించారు.

### నైనీ కోల్ బ్లాక్‌తో మరింత బలం

ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ కూడా సింగరేణికి దక్కేలా కేంద్రం కృషి చేసిందని మంత్రి తెలిపారు. ఈ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఇవి మరో 30 నుంచి 35 సంవత్సరాల అవసరాలకు సరిపోతాయని వివరించారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం ఉండటంతో సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల వరకు ఆదాయం లభించే అవకాశం ఉందని వెల్లడించారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో కూడా సింగరేణి పాల్గొనేలా కేంద్రం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు.

### తెలంగాణకు భారీ లాభం

తాడిచర్ల2 గని కేటాయింపుతో తెలంగాణ ప్రభుత్వానికి కూడా గణనీయమైన ఆదాయం లభించనుంది. రాయల్టీలు, ఇతర పన్నుల రూపంలో రాష్ట్రానికి దాదాపు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. సింగరేణికి సంబంధించిన ప్రధాన మైనింగ్ ప్రాజెక్టులకు అవసరమైన పర్యావరణ, అటవీ అనుమతులను వేగంగా మంజూరు చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని చెప్పారు. దీనివల్ల కొత్త గనుల అభివృద్ధి వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు.

### సింగరేణి అభివృద్ధికి కేంద్రం మద్దతు

ప్రస్తుతం సింగరేణి సంస్థ పరిధిలో 39 గనులు పనిచేస్తున్నాయని మంత్రి వివరించారు. వీటిలో 21 అండర్‌గ్రౌండ్ గనులు, 18 ఓపెన్‌కాస్ట్ గనులు ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో ఆరు నుంచి ఎనిమిది జిల్లాల్లో సింగరేణి కార్యకలాపాలు కొనసాగుతున్నాయని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులు పోషించిన పాత్రను గుర్తు చేస్తూ వారి సేవలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని అన్నారు. దేశాభివృద్ధికి సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, సింగరేణి పురోగతికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# వామ్మో.. ఎన్ని ట్విస్టులో?

- రహస్య పెళ్లి తర్వాత హత్య కుట్ర?
- పుణె కోట కేసులో కొత్త మలుపు
- సీక్రెట్ మ్యారేజ్ కలకలం

మహారాష్ట్రలోని పుణె లోహగడ్ కోట హత్య కేసులో మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. నిందితురాలు సియా గోయల్ తన ప్రియుడు చేతన్ చౌదరిని నాలుగు నెలల క్రితమే రహస్యంగా వివాహం చేసుకున్నట్లు దర్యాప్తులో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాహం జరిగిన తర్వాత కూడా కుటుంబ సభ్యుల ఒత్తిడితో పుణె వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్‌తో ఫిబ్రవరిలో నిశ్చితార్థం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కొత్త సమాచారం కేసు దర్యాప్తులో కీలకంగా మారింది.

### వివాహ ధ్రువీకరణపై విచారణ

పోలీసులు ప్రస్తుతం ప్రత్యేక వివాహ చట్టం కింద రిజిస్ట్రేషన్ జరిగిందా లేదా అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైన వివాహ ధ్రువీకరణ పత్రం ఉందా అనే దానిపై ఆధారాలు సేకరిస్తున్నారు. ఒకవేళ ఈ రహస్య వివాహం నిజమని తేలితే, కేతన్ అగర్వాల్‌తో జరిగిన నిశ్చితార్థానికి సంబంధించిన అంశాలు కూడా కొత్త కోణంలో పరిశీలించాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సియా గోయల్ కళాశాల స్నేహితుల్లో ఇద్దరు వివాహ రిజిస్ట్రేషన్ సమయంలో సాక్షులుగా సంతకాలు చేసినట్లు సమాచారం. ఈ ఇద్దరిని కూడా పోలీసులు విచారిస్తున్నారు. అలాగే నిందితుల వ్యక్తిగత ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తొలగించిన ఫొటోలను తిరిగి రికవరీ చేసేందుకు సాంకేతిక బృందాలు ప్రయత్నిస్తున్నాయి. పెళ్లి దండలు ధరించిన ఫొటోలు అందులో ఉన్నాయని అనుమానిస్తున్నారు. ఈ డిజిటల్ ఆధారాలు దర్యాప్తులో కీలకంగా మారే అవకాశం ఉంది.



### హత్య కుట్రపై అనుమానాలు

నవంబర్‌లో ఉదయ్‌పూర్‌లో ఘనంగా వివాహం నిర్వహించేందుకు కేతన్ అగర్వాల్ కుటుంబ సభ్యులు ఏర్పాట్లు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ఆ వేడుక కోసం సియా గోయల్ వ్యక్తిగత పత్రాలు కోరిన తర్వాతే హత్య కుట్రను వేగంగా అమలు చేసినట్లు అనుమానిస్తున్నారు. వివాహ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు మధ్యవర్తికి డబ్బు చెల్లించారా అనే కోణంలో చేతన్ చౌదరి బ్యాంకు లావాదేవీలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. జూన్ 18న లోహగడ్ కోట వద్ద కేతన్ అగర్వాల్ లోయలో పడిపోవడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మొదట ప్రమాదంగా కనిపించిన ఈ సంఘటన, దర్యాప్తులో పథకం ప్రకారం జరిగిన హత్యగా మారింది. సియా గోయల్, చేతన్ చౌదరిని పోలీసులు అరెస్ట్ చేసి ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉంచారు. హత్యకు ముందు ఇద్దరూ కలిసి ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసుకు సంబంధించిన ప్రతి ఆధారాన్ని సేకరిస్తూ పూర్తి కుట్ర వెనుక ఉన్న నిజాలను వెలికితీసేందుకు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో కొత్త ఆధారాలు బయటపడుతున్న కొద్దీ దర్యాప్తు మరింత ఆసక్తికరంగా మారుతోంది.

## కాక్రోచ్ జనతా పార్టీ

# ఎక్స్ ఖాతా పునరుద్ధరణ

## సీజేపీ పార్టీకి సుప్రీం కోర్టు భారీ ఊరట

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఎక్స్ ఖాతాను తిరిగి పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం ఇకపై ఆ ఖాతాను అన్‌బ్లాక్ చేయడంపై ఎలాంటి అభ్యంతరం లేదని కోర్టుకు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి స్వరణ కాంత శర్మ పిటిషన్‌ను అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కొంతకాలంగా భారత్‌లో నిలిపివేసిన సీజేపీ ఎక్స్ ఖాతా మళ్లీ అందుబాటులోకి రానుంది.



### ఖాతా నిలిపివేతకు కారణం

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేంద్రం తన వైఖరిని వెల్లడించింది. కేంద్రం తరపున హాజరైన తుషార్ మెహతా మాట్లాడుతూ, జూన్ 21న నిర్వహించిన నీట్ రీటెస్ట్‌కు ముందు కొన్ని పోస్టులు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం సృష్టించే అవకాశం ఉందనే ఉద్దేశంతో ముందుజాగ్రత్త చర్యగా ఖాతాను బ్లాక్ చేసినట్లు వివరించారు. పరీక్ష పూర్తైన నేపథ్యంలో ఆ ఆందోళనకు ఇక ప్రాధాన్యం లేదని కోర్టుకు తెలియజేశారు.

### వ్యంగ్యమే తప్ప నేరం కాదు

పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది అఖిల్ సిబల్ వాదనలు వినిపించారు. సీజేపీ ప్రచురించిన పోస్టులన్నీ స్వచ్ఛమైన రాజకీయ వ్యంగ్యమేనని చెప్పారు. ఏదైనా ఒక్కో పోస్టుపై అభ్యంతరాలు ఉంటే వాటినే పరిమితం చేయాలని, మొత్తం ఖాతాను నిలిపివేయడం భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలను పరిశీలించిన కోర్టు, ప్రస్తుతం ఖాతాను కొనసాగించేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని స్పష్టం చేసింది.

### సోషల్ మీడియాలో సీజేపీ ప్రస్థానం

మే నెలలో భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ వ్యాఖ్యలపై చర్చల తర్వాత కాక్‌రోచ్ జనతా పార్టీ సోషల్ మీడియాలో వ్యంగ్య ఉద్యమంగా వెలుగులోకి వచ్చింది. మే 21న అసలు ఎక్స్ ఖాతా నిలిపివేయబడిన తర్వాత "కాక్రోచ్ ఈజ్ బ్యాక్" పేరుతో మరో ఖాతా ప్రారంభించింది. ఆ ఖాతాకు ఇప్పటికే 2.82 లక్షలకుపైగా అనుచరులు చేరారు. తాజా హైకోర్టు ఆదేశాలతో భావ ప్రకటన స్వేచ్ఛ, సోషల్ మీడియా నియంత్రణపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ ప్రారంభమైంది.

# రాశి ఫలితాలు

## 08.07.2026 బుధవారం

**మేష రాశి :** సంతకం చేసేటప్పుడు జాగ్రత్తలు వహించండి. ఒళ్లు నొప్పులు. సహచరులతో సఖ్యత పెంచుకోవాలి. భార్యనుకూలత. క్రీడాకారులకు సామాన్యం.

**వృషభ రాశి :** బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతారు. భార్య ఆరోగ్యం పై శ్రద్ధ వహించగలరు. అన్ని రంగాల వారికి లక్ష్మీ కటాక్షం.

**మిధున రాశి :** డాక్యుమెంట్ రైటర్స్, ఉపాధ్యాయులు ప్రశంసలను అందుకుంటారు. విద్యార్థులు శ్రద్ధగా అప్లికేషన్ పూర్తి చేయగలరు. పాత మిత్రుల కలయిక ఆనందాన్ని లాభాన్ని చేకూరుస్తుంది.

**కర్కాటక రాశి:** అనవసర ఖర్చులు తగ్గించుకోగలరు. ధైర్యాన్ని పెంచుకోవాలి. ఎక్కువగా ఆలోచించొద్దు. వెంకటేశ్వర స్వామి దర్శనం విష్ణు సహస్రనామావళి పారాయణ వలన పరిస్థితులు మెరుగుపడతాయి. పని భారం ఎక్కువగా ఉందని అసహనానికి లోనుకావద్దు.

**సింహరాశి:** ఆదాయం తక్కువగా ఉండవచ్చు. భాగస్వాముల మధ్య సఖ్యత పెంచుకోవాలి. చెప్పుడు మాటలు వినవద్దు సుమా ! భార్య ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించగలరు. శ్రద్ధగా వంట చేయాలి. నవగ్రహ ప్రదక్షిణ మేలు చేస్తుంది.

**కన్యారాశి :** అన్ని రంగాలలో ఉన్నవారు నైపుణ్యాన్ని కనబరుస్తారు. కోర్టు తీర్పు అనుకూలం. ఆహార నియమాలు పాటించగలరు. క్రయవిక్రయాలలో స్వల్ప లాభం. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనం శుభప్రదం.

**తులారాశి :** వ్యాపార విస్తరణ ఆలోచనలు చేస్తారు. పోటీ తత్వంతో చేసే పనులలో విజయం సాధిస్తారు. నూతన పరిచయాలు లాభిస్తాయి. ఆర్థిక విషయాలు సంతోషాన్నిస్తాయి. గోవింద నామాలను పారాయణ చేయగలరు.

**వృశ్చిక రాశి:** రక్తసంబంధికులతో సఖ్యత పెంచుకోవాలి. వ్యాపారస్తులు ఓర్పుతో ప్రణాళికగా ముందుకు వెళ్లాలి. టాక్స్ అధికారుల బెడద ఉండవచ్చు. విద్యార్థులు పెద్దల సలహా తీసుకోవాలి. ఆన్లైన్ కొలుగోళ్ళు పై జాగ్రత్త వహించగలరు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంచి పెట్టడం వలన మేలు జరుగుతుంది.

**ధనస్సు రాశి :** పేరు ప్రఖ్యాతలకు భంగం కలిగించే పని చేయవద్దు సుమా! అధిక వడ్డీలకు అప్పు తెచ్చే ఆస్కారం ఉంది. పెద్దలకు నిద్రలేమి ఉంటుంది. అకాల భోజనం. విద్యార్థులు ఈ రోజున చేసిన పనులన్నీ అమ్మకి చెప్పండి. సెల్ఫోన్ రిపేరుకు ఆస్కారం ఉంది. నవగ్రహ ప్రదక్షిణ మేలు చేస్తుంది.

**మకర రాశి:** ఆత్మవిశ్వాసంతో సేవా కార్యక్రమాలలో నిమగ్నమై మీ శక్తికి మించిన పని చేస్తారు. ప్రయాణాలు కలిసి వస్తాయి. సినీ పరిశ్రమ వారికి అనుకూలం. క్రీడాకారులు విజయ దుందుభి మోగిస్తారు. విద్యార్థులకు సుదినము. రియల్ ఎస్టేట్ వారికి అనుకూలం.

**కుంభరాశి :** మితంగా మాట్లాడాలి ఓర్పుగా ఉండాలి. పర్యాయాలు వాయిదా వేయటం మంచిది వ్యసనపరులతో దూరంగా ఉండగలరు. ఖర్చులు నియంత్రించుకోగలరు. కాలభైరవ అష్టక ము పారాయణ మేలు చేస్తుంది.

**మీన రాశి :** హోటల్, రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్ ఏజెంట్స్ కు లాభదాయకం. భూ లాభం. బద్ధకం తగ్గించుకుంటే లక్ష్మీప్రసదమే సన్నిహితుల వల్ల లాభం. రుణ విముక్తికి ఆస్కారం. విద్యార్థులకు అనుకూలం. కుటుంబ సౌఖ్యం. రావలసిన బాకీలు వస్తాయి.



*టీటీడీ అనుబంధ సంస్థ సమరసత సిద్ధాంతి*
*'దైవజ్ఞ ' పులిపాక చంద్రశేఖర శర్మ*
*శ్రీ చక్ర పంచాంగ కర్త 9440783005*

# బద్వేలులో పిచ్చికుక్క బీభత్సం

- ఆసుపత్రి నుంచి వస్తుండగా మహిళపై దాడి



కడప జిల్లా బద్వేలు మున్సిపాలిటీలో పిచ్చికుక్క దాడి కలకలం రేపింది. అనారోగ్యంతో ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని ఇంటికి తిరిగి వస్తున్న మహిళపై వీధిలో సంచరిస్తున్న పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసింది. చేతిపై తీవ్రంగా కొరకడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. మహిళ కేకలు వేయడంతో స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని కుక్కను తరిమి ఆమెను రక్షించారు. అనంతరం బాధితురాలిని మళ్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు యాంటీ రేబీస్ టీకాలు సహా అవసరమైన చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న మున్సిపల్ అధికారులు దాడి చేసిన కుక్కను గుర్తించి అది పిచ్చికుక్కగా నిర్ధారించి మట్టుబెట్టారు.

## అనపర్తి టీడీపీ ఇన్‌చార్జిపై

# అభిప్రాయ సేకరణ

- మనోజ్ రెడ్డికి నాయకుల మద్దతు
- ఎన్టీఆర్ బీమా చెక్కుల పంపిణీ
- మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల సాయం



అనపర్తి నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జి నియామకంపై పార్టీ అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరి, పరిశీలకుడు సురేష్ బలభద్రపురంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నాయకులు, కార్యకర్తలతో అభిప్రాయ సేకరణ నిర్వహించారు. నాలుగు మండలాల పరిధిలోని 58 గ్రామాల నాయకులు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు యువనేత నల్లమిల్లి మనోజ్ రెడ్డిని టీడీపీ ఇన్‌చార్జిగా నియమించాలని ఏకగ్రీవంగా కోరారు. సేకరించిన అభిప్రాయాలను పార్టీ అధినేతకు నివేదిస్తామని నాయకులు తెలిపారు. ఇదే కార్యక్రమంలో టీడీపీ సభ్యత్వం కలిగిన ప్రమాదంలో మరణించిన ముగ్గురు కార్యకర్తల కుటుంబాలకు ఎన్టీఆర్ ప్రమాద బీమా పథకం కింద ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.15 లక్షల బాండ్లను మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర పార్టీ నేతలు అందజేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి
4
GENERAL NEWS
బుధవారం 08 జులై 2026
www.prabhathakiranam.com

# డీఎస్పీ భీమ్ రెడ్డికి రిమాండ్

**రూ.300 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు**

అక్రమాస్తుల కేసులో పోలీసు శాఖకు చెందిన డీఎస్పీ సంకిరెడ్డి భీమ్ రెడ్డికి కోర్టు రిమాండ్ విధించింది. హైదరాబాద్ పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయనపై తెలిసిన ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. సోమవారం సాయంత్రం ఇబ్రహీంబాగ్‌లోని వెస్సెల్లా మెడోస్ నివాసంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

**16 ప్రాంతాల్లో సోదాలు**

ఈ కేసు దర్యాప్తులో భాగంగా జూలై 2న ఏసీబీ అధికారులు ఏకకాలంలో 16 ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. డీఎస్పీ నివాసంతో పాటు బంధువులు, స్నేహితులు, బినామీలకు చెందిన ఇళ్లు, కార్యాలయాలు, ఇతర ప్రదేశాలను తనిఖీ చేశారు. తెలంగాణతో పాటు కర్ణాటకలో కూడా ఈ సోదాలు కొనసాగాయి. సోదాల్లో లభించిన ఆధారాల ఆధారంగా దర్యాప్తు వేగం పెంచిన అధికారులు చివరకు అరెస్ట్ చేశారు. సోదాల్లో హైదరాబాద్‌లో విల్లా, బహుళ అంతస్తుల నివాస భవనం, పలు ఫ్లాట్లు, వాణిజ్య సముదాయాల్లో వాటాలు, కమర్షియల్ స్థలాలు బయటపడ్డాయి. ప్రగతి రిసార్ట్స్ సమీపంలో ప్లాట్, నాగోల్, పటాన్‌చెరు, మొమిన్‌పేట్ ప్రాంతాల్లో భూములు గుర్తించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో వ్యవసాయ భూమి లభించింది. కర్ణాటకలో కూడా పలు ఎకరాల వ్యవసాయ భూములు, బెంగళూరు దేవనహళ్లి ప్రాంతంలో భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.300 కోట్ల వరకు ఉండొచ్చని దర్యాప్తు సంస్థ అంచనా వేస్తోంది.



**డైరీతో బయటపడిన వివరాలు**

తనిఖీల్లో డీఎస్పీ ఇంటి నుంచి సుమారు రూ.3.60 లక్షల నగదు లభించింది. బినామీగా భావిస్తున్న వ్యక్తి ఇంట్లో మరో రూ.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు రెండు కిలోల బంగారు ఆభరణాలు, సుమారు 20 కిలోల వెండి వస్తువులు కూడా అధికారులు గుర్తించారు. బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ.19.91 లక్షల నిల్వలు ఉన్నట్లు వెల్లడించారు. రాక్ శాండ్ మినరల్స్ సంస్థలో రూ.75 లక్షల పెట్టుబడి పెట్టిన వివరాలు కూడా బయటపడ్డాయి. ఈ కేసులో అత్యంత కీలక ఆధారంగా ఒక వ్యక్తిగత డైరీ మారింది. చార్‌ధామ్ యాత్రకు వెళ్లే ముందు డీఎస్పీ స్వయంగా ఆ డైరీలో ఆస్తులు, పెట్టుబడులు, అప్పులు, బినామీల వివరాలను నమోదు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఆ డైరీ ప్రతులను తన ఇద్దరు కుమారులకు వాట్సాప్ ద్వారా పంపినట్లు దర్యాప్తులో తేలింది. ఆ వివరాల ఆధారంగా పలు ఆస్తుల జాడను అధికారులు గుర్తించినట్లు సమాచారం.

# అవినీతిపై డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరిక

పోలీస్ శాఖలో అవినీతిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఖమ్మం పర్యటనలో ఆయన పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల స్మగ్లింగ్, సైబర్ నేరాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిర్వహణ మెరుగుదలకు ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ బ్యూరో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సరిహద్దు ప్రాంతాల్లో నిఘా మరింత బలోపేతం చేస్తున్నామని డీజీపీ తెలిపారు.

# ధరణిపై సర్కార్ ఫోకస్

• అక్రమాలపై ఉక్కుపాదం • సమగ్ర దర్యాప్తుకు కసరత్తు



వివరాలు 5లో..

ధరణి పోర్టల్‌లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న భూ అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం దూకుడు పెంచింది. భూ రికార్డులు, రిజిస్ట్రేషన్లలో జరిగిన అవకతవకలను పూర్తిస్థాయిలో వెలికితీసేందుకు సమగ్ర దర్యాప్తు చేపట్టే దిశగా చర్యలు వేగవంతమయ్యాయి. ఇప్పటికే ఉన్నతస్థాయి ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో, తదుపరి దశలో ప్రత్యేక దర్యాప్తు బృందం... సిట్ ఏర్పాటు చేసే అవకాశాలపై కూడా తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భూ రికార్డుల భద్రతను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

**ఫోరెన్సిక్ ఆడిట్‌లో సంచలన అంశాలు**

రెవెన్యూ శాఖ ఆదేశాల మేరకు నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ధరణి పోర్టల్ వ్యవస్థలో భద్రతా లోపాలను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమంగా ఎంట్రీలు చేసినట్లు గుర్తించినట్లు సమాచారం. భూమి యజమాని వేలిముద్ర, ఓటీపీ ధ్రువీకరణ లేకుండానే రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఆరోపణలు రావడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. విదేశాల్లో ఉన్న భూ యజమానులకు తెలియకుండానే వారి భూముల వివరాల్లో మార్పులు చేసిన ఘటనలు కూడా విచారణలో బయటపడినట్లు తెలుస్తోంది.

# కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

» కేసీఆర్ సరేనంటే.. ఎంత సమయమైనా కేటాయిస్తాం
» ఆయన వాదన సరైనదయితే.. ప్రాజెక్ట్ నిర్వహణ అప్పగిస్తాం
» కేటీఆర్, హరీశ్ రావులు ఆర్థిక ఉగ్రవాదులని ధ్వజం
» పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు

కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ రాజకీయాల్లో మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడైనా లేఖ రాస్తే వెంటనే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. కాళేశ్వరం అంశంపై ప్రత్యేక చర్చ నిర్వహిస్తామని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎంతసేపైనా మాట్లాడేందుకు పూర్తి అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. వాస్తవాలు ప్రజల ముందే తేలాలని, రాజకీయ విమర్శలకు బదులుగా ఆధారాలతో చర్చ జరగాలని ఆయన పేర్కొన్నారు. (**వివరాలు 7లో..**)



5లో..

# ఈ20 పెట్రోల్‌పై రాజకీయ రగడ

**గడ్కరీ సవాల్‌కు కేజ్రీవాల్ కౌంటర్**

దేశంలో ఈ20 పెట్రోల్ అమలుపై రాజకీయ వివాదం మరింత ముదిరింది. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ విమర్శకులకు బహిరంగ సవాల్ విసిరారు. ఈ20 పెట్రోల్ వల్ల దెబ్బతిన్న ఒక్క వాహనాన్నైనా చూపించాలని ఆయన ప్రశ్నించారు. దేశంలో ఇప్పటివరకు ఈ20 వాడకం కారణంగా ఏ కారుకు సమస్యలు వచ్చినట్లు నిర్ధారిత ఆధారాలు లేవని చెప్పారు. ఈ20పై తప్పుడు ప్రచారం జరుగుతోందని, కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

**కేజ్రీవాల్ కౌంటర్**

ఈ వ్యాఖ్యలకు అరవింద్ కేజ్రీవాల్ వెంటనే స్పందించారు. వాహన తయారీ సంస్థల యజమానుల మాన్యువల్‌లలో 10 శాతం కంటే ఎక్కువ ఇథనాల్ మిశ్రమం వాడకంపై పరిమితులు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ వేదికపై ఈ20 పూర్తిగా సురక్షితమని చెప్పడం వినియోగదారులను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. దేశవ్యాప్తంగా లక్షలాది వాహన యజమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నప్పటికీ కేంద్రం ఈ20 పెట్రోల్‌ను బలవంతంగా అమలు చేస్తోందని ఆరోపించారు.



3లో..

# వామ్మో ఎన్ని ట్విస్టులో

» రహస్య పెళ్లి తర్వాత హత్య కుట్ర?
» పుణె కోట కేసులో కొత్త మలుపు
» సీక్రెట్ మ్యారేజ్ కలకలం



3లో..

# కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ ఖాతా పునరుద్ధరణ

◆ సీపీజే పార్టీకి సుప్రీం కోర్టు భారీ ఊరట

వ్యంగ్యాన్ని అడ్డుకోవాలా... వాదనతో గెలవాలా? ఇదే ప్రశ్నకు ఢిల్లీ హైకోర్టు తాజా తీర్పు మరోసారి బలమైన చర్చకు తెరలేపింది. కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఎక్స్ ఖాతాపై విధించిన ఆంక్షలను ఎత్తివేస్తూ కోర్టు ఇచ్చిన ఆదేశాలు కేవలం ఒక సోషల్ మీడియా ఖాతాకు ఊరట మాత్రమే కాదు... భావ ప్రకటన స్వేచ్ఛకు లభించిన కీలక బలం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నీట్ రీ-టెస్ట్‌కు ముందు గందరగోళం తలెత్తే అవకాశముందంటూ ఖాతాను నిలిపివేసిన కేంద్ర ప్రభుత్వం, పరీక్షలు ముగిసిన తర్వాత అభ్యంతరం లేదని కోర్టుకు చెప్పడంతో మొత్తం వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. ఒకవేళ అభ్యంతరం పోస్టులకే ఉంటే... మొత్తం ఖాతాపై ఎందుకు వేటు వేశారనే ప్రశ్న ఇప్పుడు మరింత బలంగా వినిపిస్తోంది. సోషల్ మీడియాలో వ్యంగ్యం, విమర్శ, ప్రభుత్వ చర్యల మధ్య హద్దులు ఎక్కడ అనే అంశం మళ్లీ దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. ఢిల్లీ హైకోర్టు తాజా నిర్ణయం డిజిటల్ వేదికల్లో భావ స్వేచ్ఛపై రానున్న రోజుల్లో కీలక న్యాయ ప్రమాణంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# మహారాష్ట్రపై జలఖడ్గం

◆ భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం
◆ ఒకే రోజు 13 మంది మృత్యువాత

మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. గత మూడు నాలుగు రోజులుగా ముంబై, థానే, పాల్ఘర్, పుణె, నాసిక్, కొంకణ్ ప్రాంతాల్లో సాధారణ జీవనం పూర్తిగా దెబ్బతింది. రహదారులు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో రవాణా వ్యవస్థకు అంతరాయం ఏర్పడింది. గోడలు కూలడం, చెట్లు విరిగిపడటం, భవనాలు కూలిపోవడం వంటి ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర అత్యవసర నియంత్రణ కేంద్రం వివరాల ప్రకారం వర్షాలకు సంబంధించిన ఘటనల్లో ఒకే రోజు 13 మంది వరకు మరణించగా, పలువురు గాయపడ్డారు.

**ఐఎండీ హెచ్చరికలు.. ఆరెంజ్ అలర్ట్**

కేంద్ర వాతావరణ శాఖ, ముంబై, కొల్హాపూర్, సతారా, సింధుదుర్గ్, రత్నగిరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అంతకుముందు ముంబై, థానే, రాయగడ్, పుణె, నాసిక్ ఘాట్ ప్రాంతాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. నాసిక్‌లోని త్రయంబకేశ్వర్ ప్రాంతంలో మేఘ విస్ఫోటనం సంభవించే అవకాశం ఉందని సూచించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం కోరింది. (**5లో..**)



## వయనాడ్‌లో వర్ష బీభత్సం

» టన్నెల్ ప్రాజెక్టులో విరిగిపడిన మట్టి
» నిర్మాణ ప్రాంతంలో ఘోర ప్రమాదం
» ముగ్గురు మృతి, ఐదుగురి కోసం గాలింపు

కేరళలోని వయనాడ్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న అనక్కంపోయిల్-కల్లాడి-మెప్పాడి టన్నెల్ రహదారి ప్రాజెక్టు వద్ద భారీ మట్టి విరిగిపడిన ఘటన విషాదాన్ని మిగిల్చింది. కుండపోత వర్షాల కారణంగా కల్లాడి సమీపంలోని మీనాక్షి వంతెన వద్ద భారీగా మట్టి, రాళ్లు కూలిపోవడంతో నిర్మాణ ప్రాంతం ఒక్కసారిగా శిథిలాల కుప్పగా మారింది. అధికారుల తాజా వివరాల ప్రకారం ముగ్గురు మరణించారు. మరో ఐదుగురు గల్లంతయ్యారు. మొత్తం 18 మంది ఈ ప్రమాదంలో చిక్కుకోగా, వారిలో 10 మందిని గాయాలతో మెప్పాడిలోని ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన వారి కోసం యుద్ధ ప్రాతిపదికన గాలింపు కొనసాగుతోంది. (**వివరాలు 5లో..**)

# కడియంతో కయ్యం

◆ రివ్యూపై నిరసన లేఖ
◆ చురకలంటించిన సురేఖ
◆ కడియం తీరుపై తీవ్ర అభ్యంతరం
◆ క్రమశిక్షణ చర్య కోరుతూ సీఎంకు లేఖ

స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యవహారంపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసి కడియం శ్రీహరిపై పార్టీపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దేవాదాయ శాఖ మంత్రిగా తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, తన కార్యాలయాన్ని పూర్తిగా పక్కనపెట్టి కడియం శ్రీహరి దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో అధికారిక సమీక్ష నిర్వహించడం పరిపాలనా నిబంధనలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. (**వివరాలు 5లో..**)





3లో..

# టీఆర్ఎస్ పేరు వివాదం

**ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కవిత**

కల్వకుంట్ల కవిత ప్రతిపాదించిన కొత్త రాజకీయ పార్టీ పేరుపై కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. "తెలంగాణ రక్షణ సమితి" పేరును తన పార్టీకి కేటాయించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. మే 12, జూన్ 23 తేదీల్లో ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసులను ఆమె సవాలు చేశారు. పార్టీ పేరును ఖరారు చేసే విషయంలో ఎన్నికల సంఘం అనుసరించిన విధానంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

# సింగరేణికి భారీ ఊరట

» తాడిచర్ల2 గనులకు కేంద్రం ఆమోదం
» ₹ 64 వేల కోట్ల ఆదాయానికి చాన్స్
» వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రెడ్డి



తెలంగాణలోని సింగరేణి సంస్థకు తాడిచర్ల2 బొగ్గు గనులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారని, సంబంధిత ఫైల్‌పై తాను సంతకం చేసినట్లు చెప్పారు (**వివరాలు 3లో..**)



5లో..

# మనవడు హిమాన్షుకు స్వల్ప గాయం

ఏఐజీకి వచ్చిన మాజీ సీఎం కేసీఆర్
జిమ్ చేస్తున్న సందర్భంగా ప్రమాదం
కోలుకుంటున్న కేటీఆర్ తనయుడు




3లో..

# ప్రియుడి కోసం భర్త హత్య

ఏడు నెలలకు గుట్టురట్టు
మిస్సింగ్ కేసుగా మొదలైన దర్యాప్తు
తప్పించుకోవాలనుకున్న భార్య అరెస్ట్




# ఈ20 పెట్రోల్‌పై రాజకీయ రగడ

### గడ్కరీ సవాల్‌కు కేజ్రీవాల్ కౌంటర్

దేశంలో ఈ20 పెట్రోల్ అమలుపై రాజకీయ వివాదం మరింత ముదిరింది. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ విమర్శకులకు బహిరంగ సవాల్ విసిరారు. ఈ20 పెట్రోల్ వల్ల దెబ్బతిన్న ఒక్క వాహనాన్నైనా చూపించాలని ఆయన ప్రశ్నించారు. దేశంలో ఇప్పటివరకు ఈ20 వాడకం కారణంగా ఏ కారుకు సమస్యలు వచ్చినట్లు నిర్ధారిత ఆధారాలు లేవని చెప్పారు. ఈ20పై తప్పుడు ప్రచారం జరుగుతోందని, కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

### కేజ్రీవాల్ కౌంటర్

ఈ వ్యాఖ్యలకు అరవింద్ కేజ్రీవాల్ వెంటనే స్పందించారు. వాహన తయారీ సంస్థల యజమానుల మాన్యువల్‌లలో 10 శాతం కంటే ఎక్కువ ఇథనాల్ మిశ్రమం వాడకంపై పరిమితులు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ వేదికపై ఈ20 పూర్తిగా సురక్షితమని చెప్పడం వినియోగదారులను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. దేశవ్యాప్తంగా లక్షలాది వాహన యజమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నప్పటికీ కేంద్రం ఈ20 పెట్రోల్‌ను బలవంతంగా అమలు చేస్తోందని ఆరోపించారు.

### వాహన కంపెనీల ప్రస్తావన

జూలై 3న ప్రభుత్వం ఆరు ప్రధాన వాహన తయారీ సంస్థలపై ఈ20కు మద్దతు ప్రకటించాలని ఒత్తిడి తీసుకొచ్చిందని కేజ్రీవాల్ ఆరోపించారు. అందులో మూడు సంస్థలు అలాంటి ప్రకటన చేయడానికి నిరాకరించాయని చెప్పారు. మారుతి, టయోటా, హీరో మాత్రం పాత వాహనాల్లో కూడా ఈ20 వాడొచ్చని, అయితే మైలేజ్ 5 నుంచి 7 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే టయోటా యజమానుల మాన్యువల్‌లో ఈ10 ఇంధనానికే ప్రాధాన్యం ఇచ్చినట్లు కూడా కేజ్రీవాల్ చెప్పారు.

### గడ్కరీ సమర్థన

ఈ20 విధానం వెనుక ప్రధాన లక్ష్యం దేశంలో ముడి చమురు దిగుమతులను తగ్గించడమేనని గడ్కరీ వివరించారు. ప్రతి సంవత్సరం ఇంధన దిగుమతుల కోసం దేశం సుమారు రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని గుర్తు చేశారు. ఇథనాల్ వినియోగం పెరగడం వల్ల విదేశీ మారక వ్యయం తగ్గడంతో పాటు కాలుష్య నియంత్రణకు కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. తన కుటుంబానికి చెందిన చక్కెర కర్మాగారాల కారణంగానే తాను ఇథనాల్‌కు మద్దతు ఇస్తున్నానన్న ఆరోపణలను ఆయన ఖండించారు. మొక్కజొన్న నుంచి ఇథనాల్ ఉత్పత్తిని ప్రోత్సహించడం వల్ల ఉత్తరప్రదేశ్, బీహార్ రైతులకు అదనంగా రూ.45 వేల కోట్ల ఆదాయం లభించిందని తెలిపారు.

### సోషల్ మీడియాలోనూ హోరాహోరీ

ఈ20 పెట్రోల్ అంశం రాజకీయ వేదికలకే పరిమితం కాలేదు. సోషల్ మీడియాలో కూడా దీనిపై విస్తృత చర్చ సాగుతోంది. భూటాన్ ఈ20 పెట్రోల్ కొనుగోలుకు నిరాకరించిందంటూ వ్యంగ్య మీమ్స్ వైరల్ అయ్యాయి. ఫ్లెక్స్ ఫ్యూయల్ కార్ల విక్రయాలపై వచ్చిన వార్తల నేపథ్యంలో కూడా పలువురు నెటిజన్లు వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఈ20పై అనుకూలురు, వ్యతిరేకుల మధ్య వాదనలు కొనసాగుతుండగా, కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని మరింత విస్తరించే దిశగా ఈ85, ఈ100 వంటి అధిక ఇథనాల్ మిశ్రమ ఇంధనాలకు కూడా అనుకూలంగా నిబంధనల్లో మార్పులు తీసుకురావాలని యోచిస్తోంది. దీంతో ఈ20 పెట్రోల్‌పై చర్చ రానున్న రోజుల్లో మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ధరణిపై సర్కార్ ఫోకస్

- అక్రమాలపై ఉక్కుపాదం
- సమగ్ర దర్యాప్తుకు కసరత్తు

ఫోరెన్సిక్ ఆడిట్‌లో సంచలన అంశాలు

రెవెన్యూ శాఖ ఆదేశాల మేరకు నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ధరణి పోర్టల్ వ్యవస్థలో భద్రతా లోపాలను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమంగా ఎంట్రీలు చేసినట్లు గుర్తించినట్లు సమాచారం. భూమి యజమాని వేలిముద్ర, ఓటీపీ ధ్రువీకరణ లేకుండానే రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఆరోపణలు రావడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. విదేశాల్లో ఉన్న భూ యజమానులకు తెలియకుండానే వారి భూముల వివరాల్లో మార్పులు చేసిన ఘటనలు కూడా విచారణలో బయటపడినట్లు తెలుస్తోంది.

**• 22 వేల రిజిస్ట్రేషన్లపై అనుమానాలు**

ధరణి పోర్టల్‌లో జరిగిన సుమారు ఎనిమిది లక్షల లావాదేవీలను అధికారులు పరిశీలించినట్లు సమాచారం. ఈ పరిశీలనలో దాదాపు 22 వేల రిజిస్ట్రేషన్లలో అసాధారణ తేడాలు గుర్తించినట్లు తెలుస్తోంది. 'ఘోస్ట్ ఐడీలు' ఉపయోగించి లక్షల ఎకరాల భూ రికార్డులను మార్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు సిస్టమ్ టైమ్‌ను మార్చి పాత తేదీలతో రిజిస్ట్రేషన్లు నమోదు చేసినట్లు కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేరళకు చెందిన సైబర్ భద్రతా సంస్థ నిర్వహించిన ఆడిట్‌లో ఈ అంశాలు బయటపడినట్లు సమాచారం.

**• ప్రత్యేక కమిటీకి కీలక బాధ్యతలు**

తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఉన్నతస్థాయి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ధరణి, భూ భారతి పోర్టళ్లలో జరిగిన అక్రమాలను గుర్తించడం, బాధ్యులను నిర్ధారించడం, కఠిన చర్యలు సూచించడం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలను సిఫారసు చేయడం వంటి బాధ్యతలు అప్పగించింది. రెవెన్యూ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రక్రియలో కలెక్టర్లు, సైబర్ భద్రత నిపుణులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ నిపుణులు సభ్యులుగా ఉన్నారు. కమిటీ 15 రోజుల్లో నివేదిక సమర్పించాల్సి ఉంది.

**• కొత్త భద్రతా వ్యవస్థకు రూపకల్పన**

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఫోరెన్సిక్ ఆడిట్ పురోగతిని పరిశీలించారు. భూ రికార్డుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుత వ్యవస్థలో ఉన్న లోపాలను పూర్తిగా తొలగించేలా నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ ద్వారా అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కొత్త సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ధరణి పోర్టల్ వ్యవహారం తెలంగాణ రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తుండగా, ప్రభుత్వం చేపట్టబోయే తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది.





# కడియంతో కయ్యం

- రివ్యూపై నిరసన లేఖ
- చురకలంటించిన సురేఖ
- కడియం తీరుపై తీవ్ర అభ్యంతరం
- క్రమశిక్షణ చర్య కోరుతూ సీఎంకు లేఖ

స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యవహారంపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసి కడియం శ్రీహరిపై పార్టీపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దేవాదాయ శాఖ మంత్రిగా తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, తన కార్యాలయాన్ని పూర్తిగా పక్కనపెట్టి కడియం శ్రీహరి దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో అధికారిక సమీక్ష నిర్వహించడం పరిపాలనా నిబంధనలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు.

### మంత్రి అధికారాల్లో జోక్యమా?

శాఖాపరమైన సమీక్షలు నిర్వహించడం, అధికారులకు ఆదేశాలు ఇవ్వడం శాఖా మంత్రి పరిధిలోని అంశమని కొండా సురేఖ స్పష్టం చేశారు. అలాంటప్పుడు ఒక ఎమ్మెల్యే నేరుగా అధికారులను పిలిచి సమీక్ష నిర్వహించడం ఏ విధంగా సమంజసమని ప్రశ్నించారు. మాస్టర్ ప్లాన్లు, శాఖ నివేదికలపై సూచనలు ఇవ్వడం మంత్రి అధికార పరిధిలోనే ఉంటుందని చెప్పారు. ఈ చర్య వల్ల ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది పలికినట్లవుతుందని ఆమె లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నేతలను రెచ్చగొట్టి తనపై కడియం శ్రీహరి దుష్ప్రచారం చేశారని కొండా సురేఖ ఆరోపించారు. ఇప్పుడు కూడా కావాలనే తనను పక్కనపెట్టి దేవాదాయ శాఖ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ తరహా చర్యల వల్ల శాఖ అధికారుల్లో అయోమయం నెలకొంటోందని, పరిపాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

### విచారణ జరపాలని డిమాండ్

ప్రజాప్రతినిధిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాల్సిన బాధ్యత కడియం శ్రీహరిపై ఉందని మంత్రి గుర్తుచేశారు. మంత్రి అధికారాలను అతిక్రమిస్తూ వ్యవహరించినందుకు పార్టీ క్రమశిక్షణ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై కడియం శ్రీహరి నుంచి వివరణ కూడా తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. హైదరాబాద్‌లోని బొగ్గులకుంట దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించిన నేపథ్యంలో ఈ వివాదం చెలరేగింది. దేవాలయాలకు సంబంధించిన సమస్యలు ఉంటే మంత్రి లేదా శాఖ అధికారులకు వినతిపత్రం ఇవ్వడం సరైన పద్ధతి తప్ప, ఎమ్మెల్యే స్వయంగా అధికారిక సమీక్ష నిర్వహించడం పరిపాలనా విధానాలకు విరుద్ధమని కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. ఈ ఘటన ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. సీఎం రేవంత్ రెడ్డి ఈ ఫిర్యాదుపై ఎలా స్పందిస్తారనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# మనవడు హిమాన్షుకు స్వల్ప గాయం

- ఏఐజీకి వచ్చిన మాజీ సీఎం కేసీఆర్
- జిమ్ చేస్తున్న సందర్భంగా ప్రమాదం
- కోలుకుంటున్న కేటీఆర్ తనయుడు



మాజీ సీఎం కేసీఆర్ మనవడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు కుమారుడు హిమాన్షు రావుకు స్వల్ప గాయమైంది. సోమవారం సాయంత్రం వ్యాయామం చేస్తున్న సమయంలో జరిగిన క్రీడా సంబంధిత ప్రమాదంలో అతడి ముక్కుకు గాయమైనట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. వెంటనే ఆయనను హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పటల్‌కు తరలించి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు గాయం స్వల్పంగానే ఉందని తెలిపారు.

### ఆస్పత్రికి చేరుకున్న కుటుంబ సభ్యులు

హిమాన్షు గాయపడిన విషయం తెలిసిన వెంటనే కేటీఆర్ ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. మాజీ మంత్రి టి. హరీశ్ రావు కూడా ఆస్పత్రికి వెళ్లి హిమాన్షు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సిద్ధిపేట జిల్లాలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా వెంటనే హైదరాబాద్‌కు చేరుకుని మనవడిని పరామర్శించారు. హిమాన్షుకు అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

### కోలుకుంటున్నానని హిమాన్షు వెల్లడి

చికిత్స పొందుతున్న హిమాన్షు సోషల్ మీడియా వేదికగా తన ఆరోగ్యంపై స్పందించారు. క్రీడా సంబంధిత చిన్న ప్రమాదం కారణంగా ఆస్పత్రిలో చేరానని తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యం బాగానే ఉందని, పూర్తిగా కోలుకోవడానికి కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు చెప్పారు. తన ఆరోగ్యం గురించి ఆందోళన వ్యక్తం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రేమ, మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే సాధారణ జీవితంలోకి తిరిగి వస్తాననే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

### కేటీఆర్ స్పందన

కేటీఆర్ కూడా సామాజిక మాధ్యమంలో హిమాన్షు ఆరోగ్యంపై వివరాలు వెల్లడించారు. తన కుమారుడికి చిన్నపాటి క్రీడా గాయం మాత్రమే అయిందని, ప్రస్తుతం చికిత్స కొనసాగుతోందని చెప్పారు. మరికొన్ని రోజుల్లో పూర్తిగా కోలుకుని మామూలు జీవితంలోకి తిరిగి వస్తాడని తెలిపారు. ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా హిమాన్షు ఆరోగ్యం గురించి ఆరా తీసిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### వైద్యుల భరోసా

హిమాన్షు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు స్పష్టం చేశారు. గాయం తీవ్రంగా లేదని, విశ్రాంతితో త్వరగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కేసీఆర్ ఆస్పత్రిలో వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడి చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఈ ఘటనతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హిమాన్షు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

# సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్

సింగరేణికి తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ కేటాయించిన కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. ఈ నిర్ణయంతో మరో 40 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తికి భరోసా లభించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తాడిచర్ల2లో 434.14 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఏడాదికి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 3 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని చెప్పారు. భూపాలపల్లి ప్రాంత అభివృద్ధికి ఇది ఊతమివ్వడంతో పాటు విద్యుత్, పారిశ్రామిక రంగాలకు దీర్ఘకాలిక బొగ్గు భద్రత కల్పిస్తుందని పేర్కొన్నారు.

# 7వ విడత రైతుభరోసా నిధుల జమ



రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద 7వ విడతలో 7 నుంచి 8 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతుల ఖాతాల్లో రూ.259.73 కోట్లను జమ చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ విడతలో 58,831 మంది రైతులు, 4.32 లక్షల ఎకరాలకు సంబంధించిన సాయం పొందారని వెల్లడించారు. ఇప్పటివరకు రైతుభరోసా పథకం కింద 68.96 లక్షల మంది రైతులకు, 129.17 లక్షల ఎకరాల సాగుభూమికి రూ.7,750.45 కోట్లను ప్రభుత్వం విడుదల చేసినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి రైతుకు రైతుభరోసా అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# వయనాడ్‌లో వర్ష బీభత్సం



- టన్నెల్ ప్రాజెక్టులో విరిగిపడిన మట్టి
- నిర్మాణ ప్రాంతంలో ఘోర ప్రమాదం
- ముగ్గురు మృతి, ఐదుగురి కోసం గాలింపు

కేరళలోని వయనాడ్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న అనక్కంపోయిల్ -కల్లాడి -మెప్పాడి టన్నెల్ రహదారి ప్రాజెక్టు వద్ద భారీ మట్టి విరిగిపడిన ఘటన విషాదాన్ని మిగిల్చింది. కుండపోత వర్షాల కారణంగా కల్లాడి సమీపంలోని మీనాక్షి వంతెన వద్ద భారీగా మట్టి, రాళ్లు కూలిపోవడంతో నిర్మాణ ప్రాంతం ఒక్కసారిగా శిథిలాల కుప్పగా మారింది. అధికారుల తాజా వివరాల ప్రకారం ముగ్గురు మరణించారు. మరో ఐదుగురు గల్లంతయ్యారు. మొత్తం 18 మంది ఈ ప్రమాదంలో చిక్కుకోగా, వారిలో 10 మందిని గాయాలతో మెప్పాడిలోని ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన వారి కోసం యుద్ధ ప్రాతిపదికన గాలింపు కొనసాగుతోంది.

### సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం

ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. అయితే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం, దట్టమైన బురద కారణంగా శిథిలాలను తొలగించడం కష్టంగా మారింది. భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించలేకపోవడంతో సహాయక చర్యలు నెమ్మదిగా సాగుతున్నాయి. ప్రమాదం జరిగిన ప్రాంతంలోని కార్మికుల తాత్కాలిక నివాసాల వద్ద నుంచి పలువురిని సురక్షితంగా బయటకు తీసి చికిత్స కోసం తరలించారు. సమీపంలోని కుటుంబాలను కూడా ముందుజాగ్రత్తగా ప్రభుత్వ పాలిటెక్నిక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సహాయ శిబిరానికి తరలించారు.

### మానవ తప్పిదమేనని ఆరోపణలు

కేరళ వ్యవసాయ మంత్రి టి. సిద్ధిక్ ఈ ఘటనను సహజ విపత్తుగా కాకుండా “మానవ తప్పిదం”గా అభివర్ణించారు. తవ్వకాలలో వెలికితీసిన మట్టిని శాస్త్రీయ పద్ధతిలో తొలగించకుండా ఒకేచోట పేరుకుపోయేలా ఉంచడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. జిల్లా యంత్రాంగం ముందుగానే హెచ్చరికలు జారీ చేసినప్పటికీ సంబంధిత నిర్మాణ సంస్థ వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

### నిపుణుల హెచ్చరికలు

పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు మరింత జాగ్రత్త అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. 8.73 కిలోమీటర్ల పొడవున్న ఈ టన్నెల్ ప్రాజెక్టుకు పర్యావరణ శాఖ 24 కఠిన నిబంధనలతో అనుమతి ఇచ్చింది. అటవీ ప్రాంతాల పరిరక్షణ, ప్రత్యామ్నాయ అటవీకరణ, భూసార సంరక్షణ వంటి షరతులను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. అయినప్పటికీ నిర్మాణ ప్రాంతంలో భద్రతా ప్రమాణాల అమలుపై ఇప్పుడు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ప్రభుత్వం అప్రమత్తం

మరోవైపు కేంద్ర వాతావరణ శాఖ వయనాడ్, కోజికోడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. కేరళ ముఖ్యమంత్రి అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటిస్తూ బాధితులకు అండగా నిలవాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్ర సహాయ మంత్రి సురేష్ గోపి కూడా ఈ ఘటనను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గల్లంతైన వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడమే ప్రస్తుతం సహాయక బృందాల ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోంది.

# మహారాష్ట్రపై జలఖడ్గం

- భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం
- ఒకే రోజు 13 మంది మృత్యువాత



ముంబైలో అప్రమత్తమైన ప్రభుత్వం

దేవేంద్ర ఫడ్నవీస్ ప్రజలు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సాధ్యమైన చోట వర్క్ ఫ్రం హోమ్ అమలు చేయాలని సూచించారు. బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. చెట్లు కూలిపోవడం, గోడలు పడిపోవడం, పాత భవనాలు కూలే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను మోహరించింది. మంగళవారం ముంబైలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. ప్రజలు సముద్ర తీరాలకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.

### పుణె, లోనావాలాలో భారీ నష్టం



పుణె జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 22 చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. తొమ్మిది రహదారులను తాత్కాలికంగా మూసివేశారు. లోనావాలాలో 900 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదై 16 ఏళ్ల రికార్డు బద్దలైంది. పింప్రి చించ్వాడ్‌లో 326 మిల్లీమీటర్లు, పుణె నగరంలో 233.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంబై పుణె ఎక్స్‌ప్రెస్‌వే కనెక్టింగ్ లింక్ రోడ్డుపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం సహాయక చర్యల తర్వాత రహదారిని తిరిగి ప్రారంభించారు.

### సహాయక చర్యలు ముమ్మరం

భారీ వర్షాల కారణంగా దాదాపు 100 ఇళ్లు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. వందలాది కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ముంబైలోని జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా పెరిగి మొత్తం సామర్థ్యంలో దాదాపు 29 శాతానికి చేరుకున్నాయి. అయినప్పటికీ వర్షాలు కొనసాగనున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. విద్యుత్ స్తంభాలు, పాత భవనాలు, చెట్లకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడే వరకు అవసరం ఉంటే తప్ప ప్రయాణాలు చేయవద్దని ప్రభుత్వం హెచ్చరించింది. ప్రస్తుతం సహాయక బృందాలు రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అత్యవసర సేవలను అందిస్తున్నాయి.



అడుగడుగునా
**అవరోధం..**

అందని ద్రాక్షగా
**అధికార పీఠం**

# పల్లకీ మోసే కాపులు పాలకులయ్యేదెప్పుడు ?




**కాపులు.. ఏపీ రాజకీయాల్లో పావులా? పవర్ సెంటరా?**

**దశాబ్దాల రాజకీయ ప్రయాణం..**

**2029కు దారితీస్తున్న కొత్త సామాజిక సమీకరణాలు**

**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికారాన్ని నిర్ణయించేది కేవలం పార్టీల బలం కాదు... సమాజాల సమీకరణ కూడా. గతంలో కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తొచ్చే పలు సామాజికవర్గాలు.. ఇప్పుడు భవిష్యత్ ఎన్నికల వ్యూహాలను పదునుపెడుతున్నాయి. ఇప్పుడు ఆయా వర్గాల ఓట్లు ప్రతి పార్టీ వ్యూహానికి కేంద్ర బిందువుగా మారాయి. అందులోనూ కాపు సామాజిక వర్గం చుట్టూ తిరుగుతున్న రాజకీయ లెక్కలు ఇప్పుడు కొత్త మలుపు తీసుకుంటున్నాయి. వంగవీటి రంగా ఆత్మగౌరవ ఉద్యమం నుంచి ముద్రగడ పద్మనాభం రిజర్వేషన్ పోరాటం వరకు, ప్రజారాజ్యం ప్రయోగం నుంచి జనసేన అధికార భాగస్వామ్యం వరకు కాపు రాజకీయాల ప్రయాణం ఎన్నో మలుపులు తిరిగింది. 2029 ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ మరోసారి కాపు ఓటు ఏ దిశగా కదులుతుందన్న చర్చ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కాపులు కేవలం ఎన్నికల పావులా, లేక అధికారాన్ని నిర్ణయించే పవర్ సెంటరా అన్న ప్రశ్నకు సమాధానం వెదుకుతున్నాయి అన్ని ప్రధాన పార్టీలు. దశాబ్దాల రాజకీయ చరిత్ర, సామాజిక ఉద్యమాలు, మారుతున్న ఓటర్ల మనస్తత్వం, కొత్త నాయకత్వ సమీకరణాలు కలిసి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు కొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నాయి. ఈ మార్పుల వెనుక ఉన్న అసలు కథే ఇది.**

### కాపు సమీకరణాలతో మారుతున్న రాజకీయ చిత్రం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల చరిత్రను పరిశీలిస్తే ప్రతి దశలో ఒక సామాజిక వర్గం రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారిన సందర్భాలు కనిపిస్తాయి. ఒక దశలో రెడ్డి నాయకత్వం, మరో దశలో కమ్మ వ్యాపార-రాజకీయ శక్తి, మరో సమయంలో వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం ప్రధాన చర్చగా నిలిచాయి. ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కాపు సామాజిక వర్గం చుట్టూ రాజకీయ వ్యూహాలు, సామాజిక సమీకరణాలు, ఎన్నికల లెక్కలు తిరుగుతున్నాయనే అభిప్రాయం బలపడుతోంది. అయితే ఈ పరిణామాన్ని కేవలం ఎన్నికల కోణంలో చూడటం సరైంది కాదు. దీని వెనుక దశాబ్దాల రాజకీయ చరిత్ర, సామాజిక ఉద్యమాలు, నాయకత్వ పరిణామాలు, ప్రాతినిధ్యంపై ఉన్న ఆకాంక్ష, అధికారంలో భాగస్వామ్యం కోసం సాగిన దీర్ఘ ప్రయాణం ఉన్నాయి. కాపు సామాజిక వర్గం ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత ప్రభావవంతమైన సామాజిక వర్గాల్లో ఒకటి. ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం వరకు ఈ వర్గం గణనీయమైన ప్రభావాన్ని కలిగి ఉంది. ఇక రాయలసీమలో బలిజ వర్గీయులు ప్రధాన భూమిక వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో అనేక నియోజకవర్గాల్లో ఫలితాలను ప్రభావితం చేసే స్థాయిలో ఈ వర్గం ఓటు ఉంది. అందుకే ఏ పార్టీ అయినా అధికారాన్ని లక్ష్యంగా పెట్టుకుంటే కాపు సామాజిక వర్గాన్ని విస్మరించడం సాధ్యం కాదు.

**• రంగా ప్రభావం ఇంకా సజీవమే ఎందుకంటే!?**

స్వాతంత్ర్యానంతర కాలంలో కాంగ్రెస్ రాజకీయాల్లో కాపు నాయకులకు ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం కాపు సమాజాన్ని ఒకే రాజకీయ వేదికపై సమీకరించే నాయకత్వం చాలా కాలం వరకు కనిపించలేదు.

స్థానిక నాయకత్వం, ప్రాంతీయ ప్రభావం, వ్యక్తిగత రాజకీయ బలం ఆధారంగానే నాయకులు ఎదిగారు. ఫలితంగా కాపు ఓటు కూడా ఏ ఒక్క పార్టీకి శాశ్వతంగా కట్టుబడి ఉండలేదు. 1980లలో రాష్ట్ర రాజకీయాల్లో వచ్చిన భారీ మార్పు కాపు రాజకీయాలకు కూడా కొత్త దిశను చూపింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో అనేక సామాజిక వర్గాలు కొత్త రాజకీయ అవకాశాలను పొందాయి. అదే సమయంలో విజయవాడ కేంద్రంగా ఎదిగిన వంగవీటి మోహన రంగ, కాపు ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారు. ఆయన రాజకీయ శైలి, ప్రజల్లో కలిసిపోయే తీరు, యువతలో ఏర్పడిన ఆదరణ ఆయనను సాధారణ ఎమ్మెల్యే స్థాయి దాటి ఒక సామాజిక చిహ్నంగా నిలబెట్టాయి.
రంగా హత్య అనంతరం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిణామాలు కాపు రాజకీయాలను పూర్తిగా మార్చేశాయి. ఆ సంఘటన కేవలం ఒక నాయకుడి మరణంగా మిగలలేదు. అనేక ప్రాంతాల్లో అది భావోద్వేగ అంశంగా మారింది. దశాబ్దాలు గడిచినా రంగా జయంతి, వర్ధంతి సందర్భంగా కనిపించే స్పందన ఆయన ప్రభావాన్ని ఇప్పటికీ గుర్తుచేస్తుంది. రాజకీయ పార్టీలు కూడా ఈ భావోద్వేగాన్ని కాదనలేని పరిస్థితి నెలకొంది.

**• ముద్రగడతో వేడెక్కిన కాపు రాజకీయాలు**

ఆ తర్వాత కాపు రాజకీయాల్లో అత్యంత ప్రభావం చూపిన వ్యక్తిగా ముద్రగడ పద్మనాభం ఎదిగారు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆయన చేపట్టిన ఉద్యమాలు రాష్ట్ర రాజకీయాలను కుదిపేశాయి. నిరాహార దీక్షలు, మహాపాదయాత్రలు, భారీ సభలు, ప్రభుత్వాలపై ఒత్తిడి.. ఇవి కాపు ఉద్యమాన్ని సాధారణ రాజకీయ డిమాండ్ స్థాయి నుంచి సామాజిక ఉద్యమంగా మార్చాయి. రిజర్వేషన్ అంశం కాపు సమాజంలో దీర్ఘకాలిక చర్చగా నిలిచింది. కాలక్రమేణా కాపు ఉద్యమం కూడా రాజకీయ మలుపులు తిరిగింది. వివిధ ప్రభుత్వాలు కమిషన్లు ఏర్పాటు చేయడం, హామీలు ఇవ్వడం, చట్టపరమైన పరిమితులు ఎదురుకావడం, కోర్టు వివాదాలు రావడం వంటి పరిణామాలు ఉద్యమాన్ని సంక్లిష్టం చేశాయి. ఈ నేపథ్యంలో ముద్రగడ తీసుకున్న కొన్ని రాజకీయ నిర్ణయాలు విమర్శలకు గురైనా, కాపు ఉద్యమ చరిత్రలో ఆయన పాత్ర ప్రత్యేకమైనదే. ఇక సినీ రంగం కూడా కాపు రాజకీయాలపై విశేష ప్రభావం చూపింది. మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం కాపు రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఆ పార్టీకి కేవలం కాపు ఓటర్లే కాకుండా యువత, అభిమానులు కూడా ఆకర్షితులయ్యారు. అయితే ఎన్నికల ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోవడం, అనంతరం పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావడంతో ఆ ప్రయోగం ముగిసింది. అయినప్పటికీ కాపు సమాజానికి రాష్ట్ర స్థాయిలో రాజకీయ నాయకత్వం సాధ్యమేనన్న భావనను ప్రజారాజ్యం బలపరిచింది.

**• జనసేనతో బలపడిన కాపు రాజకీయాలు**

చిరంజీవి తర్వాత పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి రావడం మరో కీలక మలుపు. జనసేన పార్టీ స్థాపనతో కాపు రాజకీయాలు మరోసారి చర్చకు వచ్చాయి. అయితే పవన్ కళ్యాణ్ తన రాజకీయ ప్రయాణాన్ని కేవలం కాపు రాజకీయాలకే పరిమితం చేయకుండా రైతులు, యువత, నిరుద్యోగులు, అవినీతి వ్యతిరేకత, పారదర్శక పాలన వంటి విస్తృత అంశాలతో అనుసంధానించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఆయనకు కాపు సామాజిక వర్గంలో ప్రత్యేక ఆదరణ ఉందన్నది రాజకీయ వాస్తవమే. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి విజయం సాధించిన తర్వాత కాపు రాజకీయాలకు కొత్త కోణం ఏర్పడింది. అధికారంలో భాగస్వామిగా జనసేన ఉండటం వల్ల మొదటిసారి కాపు నాయకత్వం పాలనలో ప్రత్యక్ష బాధ్యతలు చేపట్టింది. ఈ పరిస్థితి 2029 ఎన్నికల వరకు కొనసాగితే కాపు ఓటర్ల రాజకీయ ఆలోచనలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే కాపు సమాజాన్ని ఒకే రాజకీయ శక్తిగా చూడటం వాస్తవ పరిస్థితిని పూర్తిగా ప్రతిబింబించదు.







ప్రాంతాలవారీగా, స్థానిక నాయకత్వాన్ని బట్టి, అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని బట్టి, ప్రభుత్వ పనితీరును బట్టి ఈ వర్గం ఓటింగ్ ధోరణి మారుతూ వచ్చింది. అందుకే కాపు ఓటును "స్వింగ్ ఓటు"గా రాజకీయ విశ్లేషకులు, సర్వే ఎక్స్‌పర్ట్స్ పేర్కొంటుంటారు. ఒక ఎన్నికలో ఒక పార్టీకి భారీ మద్దతు లభిస్తే, మరో ఎన్నికలో అదే వర్గం ప్రత్యామ్నాయాన్ని ఎంచుకున్న ఉదాహరణలు ఉన్నాయి.

**• కాపు ఓట్ల చుట్టూ రాజకీయ వ్యూహాలు**

ఇటీవలి కాలంలో రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న కొన్ని సంఘటనలు రాజకీయ చర్చలను మరో దిశగా మళ్లిస్తున్నాయి. ఏదైనా ఘర్షణ జరిగినా, హత్య జరిగినా, అరెస్టులు జరిగినా, రాజకీయ విమర్శలు జరిగినా... సోషల్ మీడియా నుంచి రాజకీయ వేదికల వరకు ముందుగా చర్చకు వచ్చేది కులం అనే అంశమే. బాధితుడు ఏ వర్గం? నిందితుడు ఏ వర్గం? అనే ప్రశ్నలు చట్టపరమైన అంశాల కంటే ముందుకు రావడం ప్రజాస్వామ్య చర్చల స్వరూపాన్ని ప్రభావితం చేస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చేసిన "రెడ్డి కాపులు" వ్యాఖ్యలు, గాదె సాయికృష్ణ కేసు చుట్టూ జరిగిన రాజకీయ విమర్శలు, వివిధ సామాజిక వర్గాల పేర్లు ప్రస్తావిస్తూ జరిగిన ప్రచారం... ఇవన్నీ కాపు రాజకీయాలపై కొత్త చర్చకు కారణమయ్యాయి. అయితే ప్రతి సంఘటనను కుల కోణంలో మాత్రమే చూడడం వాస్తవాలను మరుగున పడేసే ప్రమాదం కూడా ఉందని పలువురు విశ్లేషకులు సూచిస్తున్నారు. రాజకీయ పార్టీల వ్యూహాల్లో మరో ఆసక్తికర అంశం కనిపిస్తోంది. కాపు సమాజాన్ని ఆకర్షించేందుకు కాపు నాయకులను ముందుకు తీసుకురావడం... వారి ద్వారా సందేశాలు పంపించడం... సామాజిక సమావేశాల్లో చురుకుగా పాల్గొనడం, కాపు ప్రముఖుల జయంతి-వర్ధంతి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి చర్యలు అన్ని ప్రధాన పార్టీల్లో కనిపిస్తున్నాయి. ఇది రాజకీయ వ్యూహమే అయినప్పటికీ, అదే సమయంలో ప్రాతినిధ్యం కోసం సమాజం చేస్తున్న డిమాండ్‌ను కూడా ప్రతిబింబిస్తోంది.

**• 2029లో కాపు ఓటే గేమ్ ఛేంజర్..!?**

అయితే కాపు సమాజం కూడా గతంతో పోలిస్తే రాజకీయంగా మరింత పరిపక్వత సాధించింది. కేవలం భావోద్వేగాలకు మాత్రమే స్పందించే పరిస్థితి తగ్గిందని అనేక ఎన్నికలు సూచిస్తున్నాయి. ఉద్యోగాలు, విద్య, ఆర్థిక అవకాశాలు, స్థానిక అభివృద్ధి, మౌలిక వసతులు, వ్యాపారాలు, ప్రభుత్వ సేవలు వంటి అంశాలు ఓటర్ల నిర్ణయాల్లో ఎక్కువ ప్రాధాన్యం పొందుతున్నాయి. కేవలం ఒక సామాజిక వర్గానికి చెందిన నాయకుడు ఉన్నాడనే కారణంతోనే ఓటు వేయాలనే ధోరణి అన్ని ప్రాంతాల్లో కనిపించడం లేదు. 2029 ఎన్నికల దిశగా చూస్తే కాపు ఓటు మరోసారి కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. కానీ ఆ ఓటు ఏ పార్టీకి అనుకూలంగా వెళ్తుందో ముందుగానే నిర్ణయించడం సాధ్యం కాదు. అధికార కూటమి పనితీరు, ప్రతిపక్ష వ్యూహాలు, స్థానిక నాయకత్వం, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ విధానాలు... ఇవన్నీ కలిసి ఆ నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. చరిత్ర ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతోంది. కాపు సమాజాన్ని పూర్తిగా తమ రాజకీయ ఆధీనంలోకి తెచ్చుకున్న పార్టీ ఇప్పటివరకు ఏదీ లేదు. అలాగే ఈ వర్గం కూడా ఒకే పార్టీకి శాశ్వత మద్దతు ప్రకటించిన సందర్భం లేదు. అందువల్ల ఎన్నికల ముందు కనిపించే రాజకీయ సందేశాలు, సామాజిక సమావేశాలు, ప్రముఖ నాయకుల చేరికలు, కుల సమీకరణల ప్రచారం కంటే ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేసే పాలన, అభివృద్ధి, విశ్వసనీయతే చివరికి ఓటు నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా మిగిలే అవకాశముంది.



## కాపులు పావులు కాదు పవర్ సెంటర్

మొత్తంగా చూస్తే, "కాపులు... ఏపీ రాజకీయాల్లో పావులు" అనే వాక్యం రాజకీయ చర్చల్లో తరచుగా వినిపించినా... వాస్తవం మరింత సంక్లిష్టమైనది. కాపు సమాజం కేవలం రాజకీయ పావు మాత్రమే కాదు... అనేక నియోజకవర్గాల్లో ఫలితాలను ప్రభావితం చేసే నిర్ణయాత్మకమైన సామాజిక శక్తి. కాపు రాజకీయాల చరిత్రను వెనక్కి తిరిగి చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఈ సామాజిక వర్గాన్ని ఎవరూ శాశ్వతంగా తమ రాజకీయ కోటలో బంధించలేకపోయారు. భావోద్వేగాలతో మొదలైన ప్రయాణం... ఆత్మగౌరవ ఉద్యమంగా మారింది. ఉద్యమాల నుంచి అధికార భాగస్వామ్యానికి చేరుకుంది. ఇప్పుడు మాత్రం మరో దశలోకి అడుగుపెట్టింది. కాపు ఓటరు ఇక కేవలం నినాదాలు వినే స్థితిలో లేడు... పాలనను కొలుస్తాడు, పనితీరును పరిశీలిస్తాడు, తన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకుంటాడు. అందుకే 2029 ఎన్నికలు కేవలం ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన పోటీ మాత్రమే కాదు... ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక సమీకరణాల కొత్త నిర్వచనానికి కూడా వేదిక కానున్నాయి. కాపులు రాజకీయ పావులా, అధికారాన్ని శాసించే పవర్ సెంటరా అనే ప్రశ్నకు తుది సమాధానం చెప్పేది ఏ నాయకుడూ కాదు, ఏ పార్టీ కాదు... బ్యాలెట్ బాక్స్ ముందు నిలబడి తన తీర్పు చెప్పే కాపు ఓటరే. అదే తీర్పు రాబోయే దశాబ్దం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల దిశను, అధికార సమీకరణాలను, నాయకత్వ భవిష్యత్తును నిర్ణయించే చారిత్రక మలుపుగా నిలిచే అవకాశం ఉంది.







# భారత్ దౌత్య విజయం

- రక్షణ నుంచి విద్య వరకు కీలక ఒప్పందాలు
- భారత్-ఇండోనేషియా బంధం బలోపేతం
- ఇండోనేషియా అత్యున్నత పురస్కారం

భారత్ దౌత్యానికి మరో కీలక మైలురాయి దక్కింది. ఇండోనేషియా పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'బింటాంగ్ ఆది పుర్ణా' ప్రదానం కావడం రెండు దేశాల స్నేహానికి కొత్త బలం ఇచ్చింది. రక్షణ, సాంకేతికత, ఆరోగ్యం, విద్య, డిజిటల్ చెల్లింపులు, సముద్ర భద్రత వంటి అనేక కీలక రంగాల్లో దాదాపు డజను ఒప్పందాలు కుదిరాయి. బ్రహ్మోస్ క్షిపణుల సరఫరా నుంచి ఐఐఎం బెంగళూరు తొలి విదేశీ క్యాంపస్ ఏర్పాటు వరకు పలు కీలక నిర్ణయాలు వెలువడ్డాయి. ప్రవాస భారతీయులతో భేటీ అయిన మోదీ భారత్ అభివృద్ధి దిశను వివరించడంతో పాటు, వేల ఏళ్ల సాంస్కృతిక బంధాన్ని మరింత బలోపేతం చేసే చర్యలను ప్రకటించారు. ఈ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన విజయవంతమైన దౌత్య యాత్రగా నిలిచింది.

భారత్‌ఇండోనేషియా సంబంధాలను బలోపేతం చేసినందుకు గుర్తింపుగా మోదీకి ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్ణా' ప్రదానం చేశారు. ఈ గౌరవాన్ని భారత ప్రజలకు అంకితం చేస్తున్నట్లు మోదీ ప్రకటించారు. రెండు దేశాల మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న చారిత్రక, సాంస్కృతిక బంధానికి ఇది ప్రతీక అని పేర్కొన్నారు. ఈ సత్కారం ద్వైపాక్షిక స్నేహానికి మరో మైలురాయిగా నిలిచిందని అభిప్రాయపడ్డారు.

### రక్షణ రంగంలో కీలక అడుగులు

మోదీ, ప్రబోవో సుబియాంతో సమావేశంలో రక్షణ సహకారానికి అత్యంత ప్రాధాన్యం లభించింది. ఇండోనేషియాకు భారత్ బ్రహ్మోస్ క్షిపణుల సరఫరా చేయనున్నట్లు నిర్ణయించారు. ఆస్ట్రా గగనతల క్షిపణుల సరఫరాపై కూడా అవగాహన కుదిరింది. సముద్ర భద్రత, వ్యూహాత్మక సహకారం, కీలక ఖనిజాల సరఫరా గొలుసు బలోపేతంపై రెండు దేశాలు అంగీకరించాయి. ఇండోపసిఫిక్ ప్రాంతంలో భద్రతా సహకారం విస్తరించనున్నట్లు వెల్లడించారు.

### దాదాపు డజను ఒప్పందాలు

సాంకేతికత, ఆరోగ్యం, ఆహార భద్రత, ఔషధ రంగం, సముద్ర భద్రత, ఉక్కు సరఫరా, కీలక ఖనిజాల అభివృద్ధి వంటి అనేక రంగాల్లో రెండు దేశాలు దాదాపు డజను ఒప్పందాలపై సంతకాలు చేశాయి. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కృత్రిమ మేధస్సు, టెలికమ్యూనికేషన్ రంగాల్లో యువతకు ఉమ్మడి అవకాశాలు కల్పించాలని నిర్ణయించారు. స్టార్టప్ వ్యవస్థల మధ్య సహకారం పెంచేందుకు కూడా ప్రత్యేక అవగాహన ఏర్పడింది. యూపీఐ చెల్లింపు వ్యవస్థను ఇండోనేషియా డిజిటల్ చెల్లింపు వ్యవస్థతో అనుసంధానించే దిశగా అడుగులు పడ్డాయి.

### ఐఐఎం బెంగళూరు విదేశీ క్యాంపస్

ఈ పర్యటనలో మరో కీలక ప్రకటన వెలువడింది. భారత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ ఐఐఎం బెంగళూరు ఇండోనేషియాలో తన తొలి విదేశీ క్యాంపస్‌ను ప్రారంభించనుంది. ఈ క్యాంపస్ తూర్పు జావాలోని సింఘసారి ప్రత్యేక ఆర్థిక మండలిలో ఏర్పాటు కానుంది. ఆసియాన్ ప్రాంత యువతకు ఉన్నత స్థాయి యాజమాన్య విద్య అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని మోదీ తెలిపారు. విద్యా రంగ సహకారంలో ఇది కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు.

### ప్రవాస భారతీయులతో మోదీ భేటీ

జకార్తాలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. భారత్ ప్రస్తుతం "రిఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్" మంత్రంతో ముందుకు సాగుతోందని చెప్పారు. 140 కోట్ల భారతీయుల కలలు దేశ అభివృద్ధికి శక్తిగా మారాయని వ్యాఖ్యానించారు. ఇంధనం, అనుసంధానం, చిప్ తయారీ వంటి రంగాల్లో భారత్ వేగంగా ఎదుగుతోందని వివరించారు. ఇండోనేషియాలో భారతీయులు తమ స్నేహితులకు భారత్ గురించి చెప్పాలని, దేశాన్ని సందర్శించేందుకు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

### సంస్కృతి బంధానికి కొత్త ఊపు

భారత్, ఇండోనేషియా మధ్య సంబంధాలు కేవలం దౌత్యానికి పరిమితం కావని మోదీ స్పష్టం చేశారు. రెండు దేశాలను వేల ఏళ్ల నాగరికత, సంస్కృతి, సముద్ర మార్గాలు కలిపాయని చెప్పారు.

# మెలోనీ అంటే ఇష్టమే..

- కానీ... ఆమె కోపరేట్ చేయడం లేదు
- మనసులో మాట బయటపెట్టిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో తన సంబంధాలపై చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. మెలోనీ తనకు వ్యక్తిగతంగా నచ్చుతారని, మంచి వ్యక్తి అని పేర్కొన్న ట్రంప్, ఇరాన్ అంశంలో ఆమె సహకరించకపోవడం వల్ల ఇద్దరి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని చెప్పారు. టర్కీ అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగాన్‌తో సమావేశం సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఈ వ్యాఖ్యలు చేశారు.

### 'మంచి వ్యక్తే.. కానీ'

ఇరాన్కు సంబంధించిన సైనిక చర్యల్లో ఇటలీ భాగస్వామ్యం కాలేదని ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధికి సంబంధించిన కార్యకలాపాల్లో మెలోనీ ప్రభుత్వం పాల్గొనలేదని అన్నారు. అదే ఇద్దరి మధ్య విభేదాలకు కారణమైందని వివరించారు. చమురు సరఫరా పరంగా ఇటలీకి ఆ ప్రాంతం కీలకమని, అయినప్పటికీ సహకారం అందలేదని వ్యాఖ్యానించారు. మెలోనీపై విమర్శలు చేసినప్పటికీ ట్రంప్ ఆమెపై వ్యక్తిగతంగా సానుకూల వ్యాఖ్యలు చేశారు. ఆమె మంచి వ్యక్తి అని, ఇప్పటికీ తనకు ఇష్టమేనని చెప్పారు. అయితే ఇరాన్ వ్యవహారంలో తీసుకున్న నిర్ణయం మాత్రం తప్పేనని అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత అనుబంధం ఒకటైతే, అంతర్జాతీయ అంశాల్లో తీసుకునే నిర్ణయాలు మరోవైపు ఉంటాయని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టమైంది.



### సోషల్ మీడియాలో కొత్త చర్చ

గత నెలలో జరిగిన జీ7 సదస్సు తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు బహిరంగంగా వెలుగుచూశాయి. మెలోనీ తనతో కలిసి ఫొటో దిగేందుకు కోరిందని ట్రంప్ వ్యాఖ్యానించగా, ఆ ఆరోపణలను ఇటలీ ప్రధాని తీవ్రంగా ఖండించారు. ఆ వ్యాఖ్యలు పూర్తిగా కల్పితమని చెప్పారు. అనంతరం ట్రంప్ కూడా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుండా మరోసారి సమర్థించడంతో వివాదం మరింత ముదిరింది. తాజాగా ట్రంప్ తన సోషల్ మీడియా వేదికలో మెలోనీ ఫొటోను మార్ఫింగ్ చేసి పోస్టు చేయడం కూడా చర్చకు దారితీసింది. ఆ పోస్టుకు "రెస్ట్రైనింగ్ ఆర్డర్ అవసరం" అనే వ్యాఖ్య జోడించారు. ఈ పోస్టుపై మీడియా ప్రశ్నించగా ట్రంప్ మరోసారి ఇద్దరి మధ్య ఉన్న విభేదాలను ప్రస్తావించారు. దీంతో ఇటలీఅమెరికా రాజకీయ సంబంధాలపై కొత్త చర్చ మొదలైంది. టర్కీలో జరుగుతున్న నాటో సమావేశానికి ముందు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# అహ్మదాబాద్ పేలుళ్ల కేసు

- 38 మందికి ఉరిశిక్ష ఖరారు
- గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2022లో ప్రత్యేక కోర్టు విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్ష, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను ఖరారు చేసింది. కిందికోర్టు తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లను హైకోర్టు కొట్టివేసింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవే ధర్మాసనం రెండున్నరేళ్లపాటు 248 సార్లు విచారణ జరిపి తుది తీర్పు వెల్లడించింది. 2008 జూలై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల్లో 21 ప్రాంతాల్లో జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది మరణించగా, 246 మంది గాయపడ్డారు. ఈ కేసులో ఇండియన్ ముజాహిదీన్, సిమి సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించిందని కోర్టు పేర్కొంది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, క్షతగాత్రులకు రూ.5 లక్షల పరిహారం 2027 మార్చి 31లోగా చెల్లించాలని గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశ చరిత్రలో ఒకే కేసులో 38 మందికి ఉరిశిక్ష ఖరారు కావడం ఇదే తొలిసారి కావడం విశేషం.

# కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

## కేసీఆర్ సరేనంటే.. ఎంత సమయమైనా కేటాయిస్తాం

- ఆయన వాదన సరైనదయితే.. ప్రాజెక్ట్ నిర్వహణ అప్పగిస్తాం
- కేటీఆర్, హరీశ్ రావులు ఆర్థిక ఉగ్రవాదులని ధ్వజం
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు




కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ రాజకీయాల్లో మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడైనా లేఖ రాస్తే వెంటనే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. కాళేశ్వరం అంశంపై ప్రత్యేక చర్చ నిర్వహిస్తామని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎంతసేపైనా మాట్లాడేందుకు పూర్తి అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. వాస్తవాలు ప్రజల ముందే తేలాలని, రాజకీయ విమర్శలకు బదులుగా ఆధారాలతో చర్చ జరగాలని ఆయన పేర్కొన్నారు.

### వాదన నిజమైతే ప్రాజెక్టు బాధ్యత కేసీఆర్‌కే

కేసీఆర్ తన వాదనను నిరూపించగలిగితే కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల బాధ్యతను మూడు సంవత్సరాల పాటు ఆయనకే అప్పగిస్తామని రేవంత్ ప్రకటించారు. ప్రధాన కాంట్రాక్టును కూడా ఆయనకే ఇస్తామని, తనకు నచ్చిన సంస్థతో పనులు చేయించుకోవచ్చని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్చకైనా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజల ముందు నిజానిజాలు బయటపడటమే తమ ఉద్దేశమని చెప్పారు. కాళేశ్వరం నిర్మాణ సమయంలో నిపుణులు పలుమార్లు హెచ్చరించినా వాటిని పక్కన పెట్టారని ముఖ్యమంత్రి ఆరోపించారు. రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదికను కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. తమకు అనుకూలంగా నివేదిక వచ్చేలా వ్యవహరించారని ఆరోపించారు. ప్రస్తుతం ఏ నిపుణుల కమిటీ కూడా బ్యారేజీల్లో పూర్తిస్థాయిలో నీళ్లు నింపాలని సూచించలేదని గుర్తు చేశారు.

### కాళేశ్వరం కమిషన్ల ప్రాజెక్టు

కాళేశ్వరం ప్రాజెక్టును కమిషన్ల కోసం రూపొందించారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను "ఆర్థిక ఉగ్రవాదులు"గా అభివర్ణించారు. గత ప్రభుత్వం ప్రజా ధనాన్ని భారీగా ఖర్చు పెట్టినా ఆశించిన ప్రయోజనం అందలేదని విమర్శించారు. ప్రజాభవన్, సచివాలయం వంటి నిర్మాణాలను ప్రభుత్వం వినియోగిస్తోందని, కాళేశ్వరం మాత్రం నిర్మాణ లోపాల కారణంగా నిరుపయోగంగా మారిందని పేర్కొన్నారు. బలవంతంగా నీటిని నిల్వ చేస్తే బ్యారేజీలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని రేవంత్ హెచ్చరించారు. అలాంటి పరిస్థితి వస్తే భద్రాచలం ప్రాంతం ముంపుకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. భద్రతకు ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్ణయాలు తీసుకోవడం వల్లే ప్రస్తుత సమస్యలు వచ్చాయని విమర్శించారు. ప్రజల ప్రాణాలు, ప్రభుత్వ ఆస్తులు కాపాడటమే తమ బాధ్యత అని స్పష్టం చేశారు.

### ఖర్చులు పెరిగినా ప్రయోజనం లేదు

మొదట రూ.38 వేల కోట్లతో ప్రతిపాదించిన ప్రాజెక్టు వ్యయం లక్ష కోట్ల రూపాయలకు పైగా చేరిందని రేవంత్ అన్నారు. తరువాత కాగ్ అంచనాల ప్రకారం వ్యయం రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని గుర్తు చేశారు. ఖర్చు విపరీతంగా పెరిగినా ఆయకట్టు మాత్రం పెరగలేదని విమర్శించారు. ప్రాజెక్టు నుంచి ఒక్క చుక్క నీరు వినియోగంలోకి రాకముందే వేల కోట్ల అప్పులు ప్రభుత్వం చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును రూపొందించారని రేవంత్ గుర్తు చేశారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు సాగు, తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీటిని అందించాలనే లక్ష్యం ఉండేదన్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును రీడిజైన్ చేసి అసలు లక్ష్యాన్ని మార్చేసిందని ఆరోపించారు.

### పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఆధారాల ప్రదర్శన

ప్రజాభవన్‌లో నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో కాళేశ్వరం నిర్మాణ లోపాలు, రీడిజైన్ ప్రక్రియ, వ్యయ పెరుగుదల, అవినీతి ఆరోపణలు, నిపుణుల నివేదికలు వంటి అంశాలను ప్రభుత్వం వివరించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిస్థితిని చిత్రాలు, సాంకేతిక వివరాలతో వివరించారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రజా ధనాన్ని కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు.

# రామ మందిర విరాళాల వివాదం

- నైతిక బాధ్యతతో తప్పుకున్నా
- చంపత్ రాయ్ రాజీనామా
- రాజీనామా ఆమోదించిన ట్రస్ట్

అయోధ్య రామ మందిర విరాళాల చోరీ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన వేళ రామ మందిర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. నైతిక బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ట్రస్ట్ సమావేశంలో ఆయన రాజీనామాపై చర్చించి సోమవారం అధికారికంగా ఆమోదించింది. విరాళాల చోరీ వ్యవహారంలో ట్రస్ట్ పనితీరుపై ప్రశ్నలు తలెత్తిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

### రహస్య నివేదిక లీక్ అయిందన్న ఆరోపణ

జూలై 6న జరిగిన ట్రస్ట్ సమావేశంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక నివేదికను సమర్పించిందని చంపత్ రాయ్ తెలిపారు. ఆ నివేదిక ప్రస్తుతం బహిరంగంగా మారిందని చెప్పారు. తుది నివేదిక వెలువడిన తర్వాత అందులోని ప్రతి అంశంపై కాలక్రమం ప్రకారం పూర్తి వివరణ ఇస్తానని ప్రకటించారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాతే ప్రజలు సరైన నిర్ణయానికి వస్తారని ఆయన అన్నారు. సిట్ ప్రాథమిక నివేదిక అత్యంత గోప్యంగా ఉండాల్సి ఉందని చంపత్ రాయ్ పేర్కొన్నారు. అయితే ట్రస్ట్ సమావేశం జరిగిన సమయంలోనే ఆ నివేదిక బయటకు లీక్ కావడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఈ అంశం కూడా విచారణలో భాగం కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తాను మొదటి నుంచి దర్యాప్తు అధికారులకు



పూర్తిగా సహకరిస్తున్నానని స్పష్టం చేశారు.

### నా జీవితం తెరిచిన పుస్తకం

సిట్ ప్రాథమిక దర్యాప్తు ప్రకారం రామ మందిరంలో విరాళాల లెక్కింపు సమయంలో నగదు దుర్వినియోగం జరిగినట్లు ఆధారాలు లభించాయి. అందుబాటులో ఉన్న సీసీటీవీ దృశ్యాల్లో సుమారు 70 సందర్భాల్లో లెక్కింపు సిబ్బంది కరెన్సీ కట్టలు, చిల్లరను దాచిపెట్టినట్లు గుర్తించారు. భద్రతా నిబంధనలు సమర్థంగా అమలు కాకపోవడం వల్లే ఈ ఘటనలు జరిగాయని నివేదికలో పేర్కొన్నారు. ఈ అంశం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. తనపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో చంపత్ రాయ్ భావోద్వేగంగా స్పందించారు. గత 45 ఏళ్లుగా ప్రచారక్‌గా పనిచేస్తూ పారదర్శక జీవితమే గడిపానని చెప్పారు. తన జీవితం తెరిచిన పుస్తకం లాంటిదని పేర్కొన్నారు. నిజం తప్పకుండా బయటపడుతుందని పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. తుది దర్యాప్తు నివేదిక వచ్చిన తర్వాత అన్ని ప్రశ్నలకు సమాధానం ఇస్తానని మరోసారి స్పష్టం చేశారు. చంపత్ రాయ్ రాజీనామా తర్వాత ట్రస్ట్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ట్రస్టీ కృష్ణమోహన్‌ను నియమించింది.

# అయోధ్య విరాళాల చోరీ షాక్

### సిట్ దర్యాప్తులో సంచలన నిజాలు

అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కీలక ఆధారాలను సేకరించింది. ఈ అంశంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించింది. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 వరకు జరిగిన విరాళాల లెక్కింపును పరిశీలించిన సిట్, కొంతమంది సిబ్బంది నగదును అక్రమంగా అపహరించినట్లు నిర్ధారించింది. సీసీటీవీ దృశ్యాల పరిశీలనలో పలువురు ఉద్యోగులు కరెన్సీ నోట్ల కట్టలు, చిల్లరను తమ దుస్తులు, జేబులు, బూట్లలో దాచుకుని బయటకు తీసుకెళ్లినట్లు స్పష్టంగా కనిపించినట్లు అధికారులు వెల్లడించారు.

### 70 సార్లు చోరీ జరిగినట్లు గుర్తింపు

దర్యాప్తులో నిందితులు ఒక్కసారి కాదు, దాదాపు 70 సార్లు ఇదే తరహాలో చోరీలకు పాల్పడినట్లు సిట్ గుర్తించింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ ఘటనలను కొందరు అధికారులు ప్రత్యక్షంగా గమనించినప్పటికీ అడ్డుకునే ప్రయత్నం చేయలేదని నివేదికలో పేర్కొంది. భద్రతా వ్యవస్థలో నిర్లక్ష్యం, పర్యవేక్షణలో వైఫల్యం కారణంగానే ఈ చోరీలు వరుసగా జరిగాయని సిట్ అభిప్రాయపడింది. దర్యాప్తు సందర్భంగా ట్రస్ట్ సభ్యులు, బ్యాంకు అధికారులు, భద్రతా సిబ్బంది, విరాళాల లెక్కింపు సిబ్బంది వాంగ్మూలాలు నమోదు చేశారు. వారి సమాచారాన్ని పరిశీలించిన తర్వాత ఏప్రిల్ 27కు ముందే కూడా విరాళాల చోరీలు జరిగి ఉండే అవకాశం ఉందని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఆ కాలానికి సంబంధించిన పాత సీసీటీవీ ఫుటేజ్ అందుబాటులో లేకపోవడంతో ఆ ఆరోపణలకు సంబంధించిన ప్రత్యక్ష ఆధారాలను సేకరించడం కష్టంగా మారిందని వెల్లడించారు. కేసు పూర్తి స్థాయిలో వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో గత ఐదేళ్ల ఆర్థిక లావాదేవీలపై రీఆడిట్ ప్రారంభించారు. బ్యాంకు రికార్డులు, విరాళాల పత్రాలు, ఆలయ నిర్మాణ వ్యయాలు, బంగారం, వెండి కానుకల వివరాలు, నగదు లెక్కలన్నింటినీ పరిశీలిస్తున్నారు. ప్రతి లావాదేవీని మళ్లీ తనిఖీ చేస్తూ ఎక్కడైనా అక్రమాలు జరిగాయా అనే కోణంలో సిట్ దర్యాప్తు కొనసాగిస్తోంది.

### భద్రతా వ్యవస్థలో పలు లోపాలు

దర్యాప్తులో ఆలయ భద్రతా వ్యవస్థలో అనేక లోపాలు బయటపడ్డాయి. బయోమెట్రిక్ హాజరు విధానంలో బలహీనతలు, డిజిటల్ పరికరాల వినియోగ నియంత్రణలో లోపాలు, సీసీటీవీ పర్యవేక్షణలో నిర్లక్ష్యం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. విలువైన కానుకల నమోదు, తూకం వేయడం, భద్రపరిచే విధానాల్లో కూడా నిబంధనలు పూర్తిగా అమలు కాలేదని తేలింది. ఈ లోపాలనే ఆసరాగా తీసుకుని నిందితులు చోరీలకు పాల్పడినట్లు సిట్ నిర్ధారించింది. ఈ కేసులో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణెలిష్ పాండే, రామశంకర్ మిశ్రా ప్రమేయం ఉన్నట్లు సిట్ స్పష్టం చేసింది. ముఖ్యంగా సీసీటీవీ దృశ్యాల్లో అవినాష్ శుక్లా, మనీష్ కుమార్ యాదవ్ పలుమార్లు నగదు, విలువైన వస్తువులను అపహరిస్తున్న దృశ్యాలు రికార్డు అయినట్లు తెలిపింది. ఈ ఆధారాల ఆధారంగా కేసును మరింత విస్తరించి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# అసలు చేతికి వచ్చేది ఎంత?




- వైరల్‌గా మారిన రూ.35 లక్షల జీతం
- గ్రాస్ జీతంపై చర్చ ఫామ్-16తో రచ్చ

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) మేనేజర్కు సంబంధించిన ఫామ్16 సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జీతాలపై పెద్ద చర్చ మొదలైంది. ఆ పత్రంలో వార్షిక గ్రాస్ జీతం రూ.35.24 లక్షలుగా కనిపించడంతో చాలామంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్ల క్రితం ప్రొబేషనరీ ఆఫీసర్గా ఉద్యోగంలో చేరిన ఉద్యోగి ప్రస్తుతం స్కేల్3 మేనేజర్గా పనిచేస్తున్నట్లు పోస్టులో పేర్కొన్నారు. అయితే ఫామ్16లో కనిపించే మొత్తం నిజంగా ప్రతి నెల ఉద్యోగి చేతికి వచ్చే జీతం కాదని వివరించడంతో చర్చ మరో మలుపు తిరిగింది.

### గ్రాస్ జీతం.. చేతికి వచ్చేది ఎంత?

వైరల్ పోస్టును పంచుకున్న వ్యక్తి ప్రకారం ఫామ్16లో కనిపించే గ్రాస్ జీతంలో సాధారణ నెలవారీ వేతనం మాత్రమే ఉండదు. లీవ్ ఫేర్ కన్సెషన్ ఎన్క్యాష్మెంట్, లీవ్ ఎన్క్యాష్మెంట్ వంటి నాలుగేళ్లకు ఒక్కసారి మాత్రమే లభించే ప్రయోజనాలు కూడా అందులో కలుస్తాయి. ఈ కారణంగా వార్షిక మొత్తం ఎక్కువగా కనిపిస్తుందని పేర్కొన్నారు. అందుకే ఫామ్16లోని సంఖ్యను చూసి ప్రతి నెలా అంతే ఆదాయం వస్తుందని భావించడం సరైనది కాదని స్పష్టం చేశారు. ఉద్యోగి జీతం నుంచి ఆదాయపు పన్ను, నేషనల్ పెన్షన్ సిస్టమ్ చందా, ఉద్యోగుల భవిష్య నిధి కోతలు జరుగుతాయి. వీటితో పాటు గృహ రుణం, కారు రుణం, ద్విచక్ర వాహన రుణానికి సంబంధించిన నెలవారీ ఈఎంఐలు కూడా జీతం నుంచి మినహాయిస్తారు. ఈ కోతల తర్వాత ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో జమయ్యే మొత్తం గ్రాస్ జీతంతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుందని పోస్టులో వివరించారు.

### మరోవైపు భిన్న వాదన

మరికొందరు మాత్రం వార్షికంగా రూ.35 లక్షలకు పైగా గ్రాస్ జీతం అనేది ఇప్పటికీ ఆకర్షణీయమైన ఆదాయమేనని పేర్కొన్నారు. ప్రాథమిక జీతం తక్కువగా కనిపించినా అలవెన్సులు, ఇతర ప్రయోజనాలు కలిపి మొత్తం ప్యాకేజీ బలంగానే ఉంటుందని అభిప్రాయపడ్డారు. అందువల్ల కోతలు ఉన్నాయనే కారణంతో ఆ జీతాన్ని తక్కువగా చూపడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. ఈ చర్చ జరుగుతున్న సమయంలో ఎస్బీఐ 1,500 మంది కొత్త ప్రొబేషనరీ ఆఫీసర్ల నియామక ప్రక్రియను ప్రారంభించింది. మొత్తం పోస్టుల్లో 1,446 రెగ్యులర్ ఖాళీలు, 54 బ్యాక్లాగ్ ఖాళీలు ఉన్నాయి. దరఖాస్తుల చివరి తేదీ జూలై 8గా నిర్ణయించారు. డిసెంబర్ నాటికి నియామక ప్రక్రియ పూర్తిచేయాలని బ్యాంకు లక్ష్యంగా పెట్టుకుంది.

### సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు

ఈ పోస్టుపై నెటిజన్లు భిన్నంగా స్పందించారు. ఫామ్16ను మాత్రమే చూసి ఉద్యోగి ఆదాయాన్ని అంచనా వేయడం సరైంది కాదని కొందరు అభిప్రాయపడ్డారు. అసలు నెలవారీ చేతికి వచ్చే జీతం, బాధ్యతలు, కోతలు చూసిన తర్వాతే నిజమైన ఆదాయాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగుల జీవితం బయటకు కనిపించినంత సులభం కాదని కూడా కొందరు వ్యాఖ్యానించారు.



# దేవుని సొమ్ముకు ప్రతి పైసా లెక్కుండాలి

**ఆదాయ వ్యయాల్లో పారదర్శకతపై దృష్టి – దేవస్థానాల ఆర్థిక నిర్వహణపై వేగుళ్ల సమీక్ష**

మండపేట నియోజకవర్గంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని దేవాలయాల ఎగ్జిక్యూటివ్ అధికారులతో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయాల ఆదాయ, వ్యయాలను సంబంధిత చైర్మన్లతో కలిసి పరిశీలించిన ఆయన, ప్రతి రూపాయి లెక్కతో పారదర్శకంగా నిర్వహణ సాగించాలని ఆదేశించారు. భక్తుల కానుకలు, విరాళాల వినియోగంలో పూర్తి రికార్డులు నిర్వహించాలని, లీజు బకాయిలు, దుకాణాల అద్దెలను సకాలంలో వసూలు చేయాలని సూచించారు. బకాయిదారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆలయాల అభివృద్ధికి ఈఓలు, చైర్మన్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పసలపూడి, నదురుబాద, మాచవరం ఈఓలు సమావేశానికి గైర్హాజరుకావడంతో రెండు రోజుల్లో సంబంధిత రికార్డులు సమర్పించాలని ఎండోమెంట్ ఇన్స్పెక్టర్‌ను ఆదేశించారు. సమావేశంలో అధికారులు, ఆలయ చైర్మన్లు పాల్గొన్నారు.

# ప్రజావాణి నోడల్ అధికారిగా విద్యాసాగర్ బాధ్యతలు

సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా కే. విద్యాసాగర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి సమక్షంలో మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌గా బదిలీ అయిన దివ్య దేవరాజన్ తన బాధ్యతలను విద్యాసాగర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా దివ్య దేవరాజన్ అందించిన సేవలను డాక్టర్ చిన్నారెడ్డి అభినందించారు. విద్యాసాగర్ నాయకత్వంలో సీఎం ప్రజావాణి కార్యక్రమం మరింత సమర్థంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇద్దరు అధికారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



# టీ20లో టీమిండియాకు చారిత్రక పరాభవం

- 125 పరుగుల తేడాతో ఇంగ్లండ్ ఘన విజయం
- సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించిన ఆతిథ్య జట్టు

నాటింగ్‌హామ్‌లో జరిగిన మూడో టీ20లో టీమిండియా ఘోర పరాజయాన్ని చవిచూసింది. 202 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ కేవలం 76 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఇంగ్లండ్ 125 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌లో 20 ఆధిక్యంలోకి వెళ్లింది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో పరుగుల పరంగా భారత్‌కు ఇదే అత్యంత భారీ ఓటమిగా నమోదైంది. గతంలో 2019లో న్యూజిలాండ్ చేతిలో ఎదురైన 80 పరుగుల పరాజయ రికార్డు చెరిగిపోయింది. భారత బ్యాటర్లలో వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ చెరో 13 పరుగులతో అత్యధిక స్కోరర్లుగా నిలవడం జట్టు వైఫల్యాన్ని ప్రతిబింబించింది. అంతకుముందు ఫిల్ సాల్ట్ 44 బంతుల్లో 70 పరుగులతో రాణించడంతో ఇంగ్లండ్ 201/7 స్కోరు చేసింది. అనంతరం ఇంగ్లండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి భారత బ్యాటింగ్‌ను కుప్పకూల్చారు. వరుసగా ఐదు టీ20 మ్యాచ్‌ల్లో భారత్ విజయం నమోదు చేయలేకపోవడం కూడా ఆందోళన కలిగిస్తోంది.

# మెస్సీ మాయతో అర్జెంటీనా అద్భుత విజయం



## 0-2 నుంచి 3-2తో ఈజిప్టుపై గెలుపు

ఫిఫా ప్రపంచకప్ 2026 ప్రీక్వార్టర్స్‌లో అర్జెంటీనా అద్భుత పునరాగమనం చేసింది. అట్లాంటాలో జరిగిన మ్యాచ్‌లో ఈజిప్టు తొలి ఆధిక్యాన్ని 20కు పెంచడంతో అర్జెంటీనా ఒత్తిడిలో పడింది. తొలి అర్ధభాగంలో లియోనెల్ మెస్సీ పెనాల్టీని కూడా చేజార్చుకున్నాడు. అయితే చివరి నిమిషాల్లో మెస్సీ జట్టును అద్భుతంగా నడిపించాడు. 79వ నిమిషంలో క్రిస్టియన్ రొమెరో గోల్‌కు సహకరించిన మెస్సీ, 83వ నిమిషంలో సమం చేసే గోల్ సాధించాడు. అదనపు సమయంలో ఎంజో ఫెర్నాండెజ్ హెడ్డర్‌తో విజేత గోల్ నమోదు చేయడంతో అర్జెంటీనా 32తో సంచలన విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

## నెరవేరని ప్రపంచకప్ కల

### కన్నీళ్లతో రొనాల్డోకు వరల్డ్‌కప్ వీడ్కోలు



ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో ప్రపంచకప్ ప్రయాణానికి భావోద్వేగ ముగింపు లభించింది. మ్యాచ్ ముగింపు విజిల్ వినిపించగానే 41 ఏళ్ల రొనాల్డో కన్నీళ్లు ఆపుకోలేక మైదానాన్ని వీడాడు. ఈ దృశ్యం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను కదిలించింది. 2006లో ప్రపంచకప్ అరంగేట్రం చేసిన రొనాల్డో, ఆరు వేర్వేరు ప్రపంచకప్ టోర్నీల్లో గోల్స్ చేసిన ఏకైక ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. మొత్తం 27 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో 11 గోల్స్ నమోదు చేసి ఎన్నో రికార్డులు నెలకొల్పాడు. 2026 ప్రపంచకప్‌లో ఐదు మ్యాచ్‌ల్లో మూడు గోల్స్ చేసిన రొనాల్డో వ్యక్తిగతంగా మెరుగైన ప్రదర్శన కనబరిచాడు. క్రొయేషియాపై సాధించిన నాకౌట్ గోల్‌తో ప్రపంచకప్ నాకౌట్ దశలో అత్యంత వయసులో గోల్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. అయినా పోర్చుగల్‌కు ప్రపంచకప్ ట్రోఫీ అందించాలనే అతని జీవితకాల కల మాత్రం నెరవేరలేదు. క్లబ్ స్థాయిలో దాదాపు అన్ని ప్రధాన ట్రోఫీలు గెలిచిన రొనాల్డోకు ప్రపంచకప్ మాత్రమే అందని ద్రాక్షగా మిగిలిపోయింది. మెస్సీతో ప్రపంచకప్ వేదికపై ముఖాముఖి పోరును చూడాలన్న అభిమానుల ఆశ కూడా తీరలేదు. ప్రపంచ ఫుట్‌బాల్‌లో ఒక స్వర్ణయుగానికి ప్రతీకగా నిలిచిన రొనాల్డో ప్రపంచకప్‌కు కన్నీళ్లతో వీడ్కోలు పలకడం అభిమానుల హృదయాలను భారంగా మార్చింది.

## ‘తలా ఫర్ ఎ రీజన్’

### ఫిఫా వరల్డ్‌కప్‌కూ ధోనీ జ్వరం




భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ 45వ పుట్టినరోజు సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈసారి ప్రత్యేక ఆకర్షణగా ఫిఫా ప్రపంచకప్ 2026 అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా చేసిన పోస్ట్ నిలిచింది. టోర్నీలో ఏడేసి గోల్స్ చేసిన లియోనెల్ మెస్సీ, కిలియన్ ఎంబాప్పే, ఎర్లింగ్ హాలాండ్ చిత్రాన్ని పంచుకుంటూ “7 Goals. Thala For A Reason. Happy Thala Day” అని క్యాప్షన్ ఇచ్చింది. ధోనీ ధరించిన నంబర్7 జెర్సీకి గుర్తుగా చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ధోనీకి భారత క్రికెట్ ప్రముఖులు కూడా శుభాకాంక్షలు తెలిపారు. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, ఆకాశ్ చోప్రా ప్రత్యేక సందేశాలు పంచుకున్నారు. బీసీసీఐ ధోనీ అంతర్జాతీయ కెరీర్ గణాంకాలతో ప్రత్యేక గ్రాఫిక్ విడుదల చేసింది. 538 అంతర్జాతీయ మ్యాచ్‌లు, 17,266 పరుగులు, వికెట్ కీపర్‌గా 829 డిస్మిసల్స్ సాధించిన ధోనీ భారత క్రికెట్‌లో చిరస్థాయిగా నిలిచాడు. 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్, 2013 ఛాంపియన్స్ ట్రోఫీని కెప్టెన్‌గా భారత్‌కు అందించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత కూడా ఐపీఎల్‌లో తన ఆటతో అభిమానులను అలరిస్తూ స్ఫూర్తిగా కొనసాగుతున్నాడు.




# సత్లుజ్ మూవీని చూడాలి.. చూపించాలి

### ఎక్స్ వేదికగా దర్శకుడు రమ్‌గోపాల్ వర్మ



ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన చిత్రం 'సత్లుజ్'. సెన్సార్ సమస్యల కారణంగా నేరుగా ఓటీటీలో విడుదల చేయగా.. ఆ తర్వాత దాన్ని తొలగించారు. ఈ మూవీని చూసిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ‘సత్లుజ’ మూవీ చూశా. ఇది సినిమా కాదు. ఎప్పటికీ నయం కానీ బలమైన గాయం. మన చరిత్రలోని చీకటి అధ్యాయాన్ని గుర్తు చేస్తుంది. దిల్జిత్ దొసాంజే గుండెలు బాదుకునేలా నటించలేదు. మనఃసాక్షికి అనుగుణంగా ఎంతో నిశ్శబ్దంగా చేసుకుంటూ వెళ్లాడు. అర్జున్ రామ్‌పాల్ నటన అదనపు బలాన్ని ఇచ్చింది. నేరాల్లో వ్యవస్థలు భాగమైన తీరును వాస్తవికతతో చూపించారు. ఈ సినిమాను సంచలనం చేయడం కన్నా.. ఒక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దారు. తెరపై అధికారిక ఫైళ్లు, దహన సంస్కారాల వివరాలు, గుసగుస సంభాషణలు వంటివి ఈ కథలోని తీవ్రతను తెలియజేశాయి. స్వలాభం కన్నా.. సత్యాన్ని వెల్లడించేలా తీర్చిదిద్దడంతో ఇది మరింత బలంగా తెరపై ఆవిష్కృతమైందని రామ్ అన్నారు. ప్రజాస్వామ్యం తన పౌరులనే కబళించి, అందుకు సాక్ష్యాలు లేకుండా ఎలా తుడిచేస్తుందో సినిమాలో తెలియజేయడం సాధారణ విషయం కాదు. ఈ విషయంలో చిత్ర బృందం తనవంతు బాధ్యతను చక్కగా పూర్తి చేసింది. ఇదే నిజమైన కళ. ఇలాంటి సినిమాను చూడాలి. చూపించాలి. చర్చించాలి. 'సత్లుజ'లో జస్వంత్ సింగ్ ఖల్రా'ను చేసినట్లు ఈ సినిమాను చేయకండి. నిజాన్ని దాచాలనుకుంటే అది మరింత దృఢంగా మారుతుందని వర్మ అన్నారు.

# నా అండాలు దాచేసుకున్నా

### • నటి కృతి సనన్ సంచలన విషయం వెల్లడి



గ్లామర్ ఇండస్ట్రీలో సక్సెస్ వేవ్‌ను రైడ్ చేయడం ఒక ఎత్తయితే, పర్సనల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేయడం మరో ఎత్తు. ముఖ్యంగా ముప్పై ఏళ్లు దాటుతున్నాయంటే చాలు.. సొసైటీ నుంచి వచ్చే ప్రెజర్, పెళ్లి `పిల్లల డెడ్‌లైన్స్ హీరోయిన్లను కాస్త టెన్షన్ పెడుతుంటాయి. కానీ ఆ రూల్స్ అన్నిటికీ చెక్ పెడుతూ బాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బ్యూటీ కృతి సనన్ ఒక సంచలన విషయాన్ని తీసుకుంది. తాను కెరీర్ ఫుల్ పీక్స్‌లో ఉన్నప్పుడే 'ఎగ్ ఫ్రీజింగ్' చేయించుకున్నానంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఇటీవల 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పాడ్‌కాస్ట్‌లో హోస్ట్ కరిష్మాతో మాట్లాడిన కృతి ఈ విషయాన్ని బయట పెట్టింది. కృతిసనన్ తనకు నేషనల్ అవార్డు తెచ్చిపెట్టిన 'మిమి' సినిమా షూటింగ్ టైమ్‌లోనే ఈ డెసిషన్ తీసుకున్నట్లు చెప్పింది. ఈ సినిమాలోని క్యారెక్టర్ కోసం చాలా బరువు పెరగాల్సి వచ్చిందట. దాంతో ఆ టైమ్‌లోనే ఎగ్ ఫ్రీజింగ్ ప్రాసెస్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిపింది. ఈ ప్రక్రియ వల్ల బాడీలో హార్మోనల్ చేంజెస్ వచ్చి శరీరం కాస్త ఉబ్బడం కామన్. ఎలాగూ సినిమా కోసం వెయిట్ గేన్ అవ్వాలి కాబట్టి ఆ రెండు నెలల బ్రేక్‌ను పర్ఫెక్ట్‌గా వాడుకుంటూ సైలెంట్‌గా ఈ మెడికల్ ప్రొసీజర్‌ను ఫినిష్ చేసినట్లు కృతిసనన్ తెలిపింది. ఆ సమయంలో మూడ్ స్వింగ్స్, ఫిజికల్ అండ్ ఎమోషనల్ చేంజెస్ ఫేస్ చేశానని కృతి చాలా ఓపెన్‌గా ఒప్పుకుంది. ఒక ప్రెగ్నెంట్ ఉమెన్ ఎలాంటి రోలర్ కోస్టర్ రైడ్‌ను ఎక్స్ పీరియన్స్ చేస్తుందో, తాను కూడా దాదాపు అలాంటి ఒడిదుడుకులే చూశానని.. కానీ ఇప్పుడు మాత్రం మైండ్ చాలా పీస్‌ఫుల్‌గా ఉందంటూ హ్యాపీగా చెప్పుకొచ్చింది. నిజానికి ఇండియన్ స్క్రీన్ పై ఈ మోడ్రన్ బాట పట్టిన ఫస్ట్ సెలబ్రిటీ కృతి కాదు. గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా తన థర్టీస్ స్టార్టింగ్‌లోనే ఎగ్స్ ఫ్రీజ్ చేసుకోగా.. ప్రొడ్యూసర్ ఏక్తా కపూర్, మోనా సింగ్, రిచా చద్దా వంటి వారు కూడా ఇదే రూట్ ఎంచుకున్నారు. మరి కృతి సనన్ ఈ విషయాన్ని బయట పెట్టిన తర్వాత ఇంకెంతమంది ఈ బాట పడతారో చూడాలి.




# అనిల్ రావిపూడి మల్టీస్టారర్

### షూటింగ్‌లో చేరిన వెంకటేశ్

టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న మల్టీస్టారర్ చిత్రాల్లో దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న కొత్త సినిమా ఒకటి. విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల కల్యాణ్ రామ్‌పై ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించిన చిత్రబృందం, ఇప్పుడు తదుపరి కీలక షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ షెడ్యూల్‌లో విక్టరీ వెంకటేష్ కూడా సెట్స్‌లోకి అడుగుపెట్టడంతో షూటింగ్ మరింత జోరందుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో వెంకటేష్, కల్యాణ్ రామ్‌తో పాటు హీరోయిన్లు కీర్తి సురేష్, కృతి శెట్టి పాల్గొంటున్నారు. ముఖ్యంగా వెంకటేష్,కల్యాణ్ రామ్‌ల మధ్య వచ్చే కీలక సన్నివేశాలు ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఇద్దరి పాత్రల మధ్య ఉండే కెమిస్ట్రీ, వినోదభరితమైన సంభాషణలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కుటుంబ కథా చిత్రాలకు వినోదాన్ని జోడించడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన అనిల్ రావిపూడి, ఈ సినిమాలో కూడా తన మార్క్ కామెడీ, భావోద్వేగాలతో ప్రేక్షకులను అలరించేలా కథను రూపొందించినట్లు తెలుస్తోంది. వెంకటేష్ కామెడీ టైమింగ్, కల్యాణ్ రామ్ మాస్ ఇమేజ్‌ను బ్యాలెన్స్ చేస్తూ పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్‌కు జోడీగా కృతి శెట్టి కనిపించనున్నారు. ఈ నాలుగు ప్రధాన పాత్రల చుట్టూనే కథ సాగనున్నట్లు తెలుస్తోంది. సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి. ఇప్పటికే కల్యాణ్ రామ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు మంచి స్పందన లభించగా, తాజా షూటింగ్ అప్‌డేట్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.

# హైదరాబాద్‌లో శరవేగంగా చిరు మూవీ షూట్

చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. మెగా 158 వర్కింగ్ టైటిల్ గా ప్రచారంలో ఉన్న దీనిపై టీమ్ అప్‌డేట్ పంచుకుంది. షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోందని తెలిపింది. మునుపెన్నడూ చూడని భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని.. చిరును కొత్త కోణంలో చూస్తారని వెల్లడించింది. రామ్ `లక్ష్మణ్ మాస్టర్స్ సారథ్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు షూట్ చేస్తున్నారు. సినిమాకు ఈ సీన్స్ హైలైట్‌గా నిలవనున్నాయి. చిరు ఇందులో రిస్క్‌తో కూడిన స్టంట్స్ చేస్తున్నారని.. త్వరలో దీని టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. 'వాల్తేర్ వీరయ్య' విజయం తర్వాత చిరంజీవి `బాబీ కాంబోలో ఈ చిత్రం రానుండడంతో అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే పొల్లాచ్చిలో ఓ కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు కొన్ని యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రాన్ని కూడా విడుదల చేశారు.




This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085